మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 18-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 50 Issue: 50

18 ఆగస్టు 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:03 సూర్యాస్తమయం - సా. 6:36 తిథి షష్ఠి సా. 5:55 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం స్వాతి ఉ. 6:41ం వరకు యోగం శుక్ల తె. 3:15ం వరకు కరణం తైతుల సా. 5:55 వరకు గరజి ఉ. 6:30ం వరకు వర్జ్యం ఉ. 10:59 నుండి మ. 12:42 వరకు దుర్ముహూర్తం ఉ. 8:34 నుండి ఉ. 9:24 వరకు రా. 11:11 నుండి రా. 11:57 వరకు రాహుకాలం మ. 3:28 నుండి సా. 5:02 వరకు యమగండం ఉ. 9:11 నుండి ఉ. 10:45 వరకు గుళికాకాలం మ. 12:19 నుండి మ. 1:54 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:27 నుండి తె. 5:15 వరకు అమృత ఘడియలు రా. 9:18 నుండి రా. 11:01 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:45 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial


# సారీ.. తప్పైంది!

## 22ఏ భూముల అప్‌డేట్‌లో క్షమాపణ చెప్పిన మంత్రి పొంగులేటి




తెలంగాణలో 22(ఏ) నిషేధిత భూముల సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కమిటీ వారానికి ఒకసారి సమావేశమై నిషేధిత భూముల దరఖాస్తులు, ఇతర సమస్యలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుందని వెల్లడించారు. నిషేధిత భూములపై పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 17 (ఈవార్తలు): ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో 22(ఏ) సమస్య ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించిన మంత్రి, మొత్తం 750 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. నిషేధిత భూములపై సమాచారానికి టోల్‌ఫ్రీ నంబరు 1800 5994788 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 22(ఏ)పై సోమవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో తరువాయి 2 వ పేజీలో...



# 'సర్' డ్రాఫ్ట్ లిస్ట్ రిలీజ్

## 2,64,87,214 మందితో జాబితా.. 92 లక్షల మందికి నోటీసులు

### సెప్టెంబర్ 16లోగా జవాబివ్వాలి.. సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 17 (ఈవార్తలు): రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ముసాయిదా జాబితా విడుదలైంది. బీఎల్‌వోలు డిజిటలైజ్ చేసిన సమాచారం ఆధారంగా ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. 2,64,87,214 మందితో ముసాయిదాను ప్రకటించింది. ఇందులో 92లక్షల మందికి నోటీసులిస్తామని సీఈవో(ఎన్నికల ప్రధానాధికారి) సుదర్శన్ రెడ్డి తెలిపారు. 60 లక్షల అనామలీస్‌తో పాటు 32 లక్షల నోమ్యాపింగ్ ఓట్లకు నోటీసులివ్వనున్నారు. నోటీసు ప్రక్రియ నెల రోజు తరువాయి 2 వ పేజీలో...

# పరీక్షలన్నీ రద్దు

## 2014 నుంచి నిర్వహించిన పరీక్షలు క్యాన్సిల్ .. జార్ఖండ్ సర్కార్ సంచలన నిర్ణయం



పరీక్షల అవకతవలపై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో జార్ఖండ్ ప్రభుత్వం సోమవారం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో టీడీపీఎల్ సంస్థ 2014 నుంచి నిర్వహించిన పరీక్షలు అన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాదు, విద్యార్థుల ప్రయోజనాల కోసం కఠినమైన చట్టం తీసుకొస్తామని సీఎం హేమంత్ సోరెన్ వెల్లడించారు.

రాంచీ: టీఎస్‌ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (టీడీపీఎల్) సంస్థ 2014 నుంచి నిర్వహించిన అన్ని పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపిక చేసిన అభ్యర్థుల లిస్టు సహా ఆ సంస్థకు సంబంధించిన ప్రతిదానినీ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు. "2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని చిన్న, పెద్ద పొరపాట్లు అన్నింటిపై సమగ్రంగా విచారణ చేస్తాం. కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించడానికి త్వరలో తరువాయి 2 వ పేజీలో...

# టిమ్స్ ఘనత మాదే

## బీఆర్ఎస్ కొబ్బరికాయే కొట్టింది.. నిర్మాణం మా వల్లే

## 2027 డిసెంబర్‌లోపు మిగతా టిమ్స్ పూర్తి చేస్తాం

## ప్రతి ఆర్నెల్లకు ఒక దవాఖాన ప్రారంభిస్తాం

## సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఉస్మానియా, టిమ్స్, వరంగల్ ఆస్పత్రులను తీర్చిదిద్ది పేదలకు వైద్యసేవలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన వచ్చాక విద్య, వైద్యాన్ని ప్రాధాన్య అంశంగా తీసుకున్నామని సీఎం తెలిపారు.

హైదరాబాద్, ఆగస్టు 17 (ఈవార్తలు): విద్యలో అనేక నూతన విధానాలను తీసుకొచ్చామని వివరించారు. పేదల వైద్యాన్ని తమ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. విద్య, వైద్యంపై చేసే వ్యయాన్ని పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే ఎక్కువ ఉపాధి అవకాశాలు తరువాయి 2 వ పేజీలో...





# పేరు మార్చితే చరిత్ర మారుతుందా?

## ఆచరణ కేసీఆర్‌ది.. ప్రచారం కాంగ్రెస్‌ది

### టిమ్స్ ప్రారంభోత్సవంపై హరీశ్ రావు

ఆలోచన, ఆచరణ కేసీఆర్‌ది అయితే.. ప్రచారం కాంగ్రెస్‌ది అన్నట్లు ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలు ఇచ్చినట్టే.. కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు.

హైదరాబాద్, ఆగస్టు 17 (ఈవార్తలు): సోమవారం సనత్‌నగర్‌లోని టిమ్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంపై ఆయన స్పందించారు. డేట్లు, డెడ్‌లైన్లు మార్చుకుంటూ పోయి, చివరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న దవాఖానలో కూడా పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురాకపోవడం శోచనీయమన్నారు. వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మించిన హాస్పిటల్‌ను కేవలం ఓపీ సేవలకే పరిమితం చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేరు మార్చినంత సులువుగా హాస్పిటల్ కట్టిన చరిత్ర మార్చలేవన్నారు. హైదరాబాద్‌కు మూడు వైపులా మూడు టిమ్స్ హాస్పిటల్స్ (అల్వాల్, సనత్‌నగర్, ఎల్బీనగర్) ఏర్పాటు చేసి, తరువాయి 2 వ పేజీలో...



## విమాన చార్జీలు పెంచితే

# మా తడాఖా చూపిస్తాం

### ఎయిర్ లైన్స్ సంస్థలకు సుప్రీం వార్నింగ్

న్యూఢిల్లీ: పీక్ ట్రావెల్ సీజన్ లో విమాన చార్జీలను ఆయా సంస్థలు ఇష్టారాజ్యంగా పెంచడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలను పాటించడంలో విమానయాన సంస్థలు ఫెయిల్ అయితే.. కఠిన చర్యల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని -2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,ం566 |
| వెండి (కిలో): | రూ.2,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,367 |

# ఫైర్‌బ్రాండ్ ఈజ్ బ్యాక్



## స్మృతి ఇరానీకి బీజేపీ కీలక బాధ్యతలు


### జనరల్ సెక్రటరీగా నియామకం.. పార్టీలో భారీ సంస్థాగత మార్పులు

### 51 మందితో కొత్త జాబితా విడుదల.. ఏపీ నుంచి ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి

## తెలంగాణకు దక్కని ప్రాతినిధ్యం

భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో భారీ సంస్థాగత మార్పులు చోటుచేసుకున్నాయి. బీజేపీ సోమవారం కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీకి బాధ్యతలు అప్పగించారు. అలాగే, మరో 13 మందిని జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించగా.. ఆరుగురు మహిళలే కావడం విశేషం.

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాంమాధవ్, పురందేశ్వరిలతో పాటు రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నాయకురాలు వసుంధర రాజే సింధియా అవకాశం దక్కింది. అయితే, తెలంగాణ నుంచి ఎవరికీ చోటుదక్కలేదు. ఇప్పటి వరకు ఉపాధ్యక్షురాలిగా ఉన్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను తప్పించారు. జాయింట్ కో-ఆర్డినేటర్‌గా తరువాయి 2 వ పేజీలో...



# ఐఎస్ఐ నెట్‌వర్క్ స్మాష్!

## పంద్రాగస్టు వేళ భారీ కుట్రకు పాక్ ప్లాన్.. షహజాద్ ఉగ్రసంస్థ నెట్‌వర్క్ నాశనం

### 200 మందికి పైగా ఆపరేటివ్‌లు అరెస్ట్.. కేంద్ర మంత్రి అమిత్ షా కీలక ప్రకటన

న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. టెర్రరిజం పట్ల భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తూ 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్లలో దేశ భద్రతా సంస్థలు స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే ఐఎస్ఐ మద్దతు గల, పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసినట్లు వెల్లడించారు. షహజాద్ భట్టి నెట్‌వర్క్‌కు చెందిన 200 మందికి పైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేశామని పేర్కొన్నారు. తద్వారా విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



మన శరీరంలో అప్పెండిక్స్‌కు పెద్దగా ఉపయోగం లేదని, మానవ పరిణామక్రమంలో మిగిలిపోయిన పనికిరాని అవయవమని చాలాకాలం భావించారు. అయితే ఇటీవలి పరిశోధనలు అప్పెండిక్స్‌కు రోగనిరోధక వ్యవస్థ, పేగుల ఆరోగ్యంలో ముఖ్యమైన పాత్ర ఉందని సూచిస్తున్నాయి. పెద్ద పేగుకు అనుసంధానమై ఉండే వేలు ఆకారంలోని చిన్న సంచిలాంటి నిర్మాణమే అప్పెండిక్స్. ఇందులో పెద్ద మొత్తంలో రోగనిరోధక కణజాలం ఉంటుంది. ముఖ్యంగా టీ కణాలు, బీ కణాలు వంటి రోగనిరోధక కణాలు ఇందులో కనిపిస్తాయి. ఈ కణాలు హానికర సూక్ష్మజీవులను గుర్తించడంలో, వాటిపై శరీర రోగనిరోధక ప్రతిస్పందనను సమన్వయం చేయడంలో సహాయపడతాయి. ముఖ్యంగా బాల్యం, ప్రారంభ వయసుల్లో రోగనిరోధక వ్యవస్థ అభివృద్ధికి అప్పెండిక్స్ దోహదపడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

# 261 మండలాల్లో లోటు వర్షపాతం

## 2 వారాల్లో పరిస్థితి దయనీయం.. ఐఎండీ హెచ్చరికలు జారీ



న్యూఢిల్లీ: వానాకాలంలోనూ ఎండలు దంచికొడుతున్నాయి. శ్రావణ మాసంలో కురవాల్సిన విస్తారమైన వర్షాలకు బదులుగా, పగటి వేళ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించనంత వర్షాలు కురిసే అవకాశం లేదని ఐఎండీ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. సోమవారం రాష్ట్రంలోనే అత్యధికంగా నల్గొండ జిల్లా వేములపల్లిలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో చెదురుముదురు వర్షాలు కురిశాయి. 15 జిల్లాల్లో లోటు వర్షపాతం ఆగస్టు నెల సగానికి పైగా పూర్తయినా.. రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన -2 వ పేజీలో...




# పెరిగిన స్మార్ట్ ఫోన్ల ధరలు

## రూ. 10,000 వరకు పెంపు.. మెమరీ చిప్‌ల ధరల పెరుగుదల వల్లే

న్యూఢిల్లీ: పండగ సీజన్‌లో రాయితీల కోసం ఎదురుచూస్తున్న వినియోగదారులకు స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలు గట్టి షాక్ ఇచ్చాయి. తమ ఫోన్ల ధరలను మరోమారు భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. పలు మోడళ్లపై రూ. 2,000 నుంచి ఏకంగా రూ. 10,000 వరకు ధరలను పెంచడం ద్వారా కొత్త ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారికి తీవ్ర నిరాశ -2 వ పేజీలో...




# జడ్డూ.. 350

## టెస్టుల్లో జడేజా సరికొత్త రికార్డు

### గాలే టెస్టులో పటిష్ట స్థితిలో భారత్

.. పూర్తి వివరాలు క్రీడావాణి పేజీలో..

## రాశి ఫలాలు

18.8.2026

మేషం: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. పాతమిత్రులను కలుసుకుని కీలక విషయాలు చర్చిస్తారు. చేపట్టిన పనులు ఆశాజనకంగా సాగుతాయి. విందువినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

వృషభం: స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సన్నిహితుల నుండి అందిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతల నుండి ఉపశమనం కలుగుతుంది.

మిధునం: చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

కర్కాటకం: ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. చేపట్టిన పనులలో శ్రమ పడ్డా ఫలితం ఉండదు. సోదరులతో ఆస్తి వివాదాలు మరింత చికాకు కలిగిస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు కొంత మందకోడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది.

సింహం: సమాజంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఇంటాబయటా ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

కన్య: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. దీర్ఘకాలిక వివాదాల నుంచి బయటపడగలుగుతారు. దూరపు బంధువులను కలుసుకుని వివాహ విషయమై చర్చ చేస్తారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి.

తుల: ఆర్థిక ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వ్యాపారమున ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

వృశ్చికం: శ్రమతో కూడిన దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగులకు ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి.

ధనస్సు: బంధు మిత్రులతో గృహమున మరింత ఉత్సాహంగా గడుపుతారు. మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాల విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. ఉద్యోగమున మరింత అనుకూల వాతావరణం ఉంటుంది.

మకరం: వ్యయప్రయాసలతో కానీ పనులు పూర్తి కావు. దూర ప్రయాణాలు ఆకస్మికంగా వాయిదా పడతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సమస్యల వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధికమవుతాయి.

కుంభం: ప్రముఖులతో పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. వృత్తివ్యాపారాలు సకాలంలో పూర్తి చేస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తినిస్తాయి.

మీనం: కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. వ్యాపారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఉద్యోగాలలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాల్సి ఉంటుంది.

# టిమ్స్ ఘనత మాదే

**మొదటి పేజీ తరువాయి**

మన విద్యార్థులకు వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆస్పత్రిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రైవేటు వైద్యం ఈ రోజుల్లో అత్యంత ఖరీదు వ్యవహారంగా మారిందని రేవంత్ రెడ్డి అన్నారు. తమ పాలనలో ఆరోగ్యశ్రీ కింద రూ. 2,700 కోట్లు చెల్లించామని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ కింద రూ. 2,526 కోట్లు ఖర్చు పెట్టామన్న ఆయన, పేదల వైద్యం కోసం ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వైద్యశాఖపై రూ. 21 వేల కోట్లు ఖర్చుపెట్టామన్నారు. ఉస్మానియా ఆస్పత్రి కూలిపోయేలా ఉందని, పదేళ్లు అధికారంలో ఉన్న వారికి ఉస్మానియా ఆస్పత్రి కడదామనే ఆలోచన రాలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం టిమ్స్ ఆస్పత్రులకు టెంకాయ కొట్టిందని, నిర్మాణాన్ని మాత్రం మర్చిపోయిందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. టిమ్స్ ఆస్పత్రులు పూర్తయితే పేదల వైద్యానికి 10 వేల పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. 2027 డిసెంబర్ 9లోపు ఉస్మానియా, మిగిలిన టిమ్స్ ఆస్పత్రులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని విధంగా ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వహిస్తామన్న రేవంత్ రెడ్డి, టిమ్స్‌కు వచ్చే రోగులకు ఆహారం, ఇతర వసతులు కల్పిస్తున్నామన్నారు. రోగులతో పాటు వచ్చే బంధువులకు ఆహారం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్ నేతలు పగటి వేషగాళ్ల మాదిరిగా తయారై హడావుడి చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము టిమ్స్ ఆస్పత్రిని ప్రారంభిస్తామనేలోపే ఇక్కడికి వచ్చి హడావుడి చేస్తున్నారన్నారు. ఇక్కడికి వచ్చి టిమ్స్‌ను పరిశీలించి, ఇది వాళ్లే కట్టామంటున్నారన్నారు. ఈ సందర్భంగా సనత్ నగర్ ఎమ్మెల్యే తీరుపై సీఎం ఛలోక్తులు విసిరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సర్జరీలు చేసే డాక్టర్లకు ఇన్సెంటివ్స్ ఇస్తామన్నారు. పేదలకు విశ్వాసం కలిగిస్తే మన జన్మసార్థకం అయినట్లేనన్నారు. విద్యార్థులకు ఉచిత విద్య, సాంకేతిక నైపుణ్యం అందిస్తే వాళ్లే బతుకుతారు. ఎవరూ ఇష్టంతో సంక్షేమ పథకాలు తీసుకోరు, కష్టం వస్తేనే తీసుకుంటారన్నారు. ప్రజలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా విధానాలు అమలు చేస్తే సంక్షేమ పథకాలు కోరుకోరన్నారు.

## 'సర్' డ్రాఫ్ట్ లిస్ట్ రిలీజ్

**మొదటి పేజీ తరువాయి**

పాటు కొనసాగుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఆ తర్వాత మరో నెల పాటు అభ్యంతరాలు, వివరణలు తీసుకుంటారు. ప్రక్రియ అంతా ముగిశాక తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు. విడుదలైన ముసాయిదా జాబితా : ఓటర్ల జాబితా సమగ్ర సవరణలో భాగంగా మరో ప్రక్రియ మొదలైంది. జూన్ 25 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో బీఎల్ఓలు 3.38 కోట్ల ఎన్యుమరేషన్ పత్రాలను అందించారు. అందులో తిరిగి 2.64 కోట్లకు పైగా ఫారాలు తిరిగి రావడంతో బీఎల్ఓలు వాటిని డిజిటలైజ్ చేశారు. 73లక్షలకు పైగా ఓట్లు తగ్గిపోయాయి. ఇందులో అబ్సెంట్, షిఫ్టింగ్, డెత్, డూప్లికేట్) వంటి కారణాలతో పత్రాలు రాలేదు. వీటి మొత్తం 21.70శాతంగా ఉంది. ఇందులో చనిపోయిన వాళ్లు 9లక్షల 22వేల 229 పర్మినెంట్లీ షిఫ్టింగ్, అబ్సెంట్, ఇతరులు 57లక్షల 46వేల 803మంది ఉన్నారు. ఒకటి కంటే ఎక్కువ ఓటర్ల జాబితాలో నమోదు చేసుకున్న 6.70లక్షల మంది మందికి పైగా ఉన్నారు. 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చే అంశంలో.. ఇతర రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉండి లేదా 10వ తేదీ లోపు ఎన్యుమరేషన్ పత్రాన్ని తిరిగి ఇవ్వకపోవడం, లేదా ఓటరుగా రిజిస్టర్ చేసుకోవడానికి ఓటరు ఆసక్తి చూపించకపోవడం లాంటి కారణాలు ఎన్నికల అధికారులు చూపిస్తున్నారు.

## ఐఎస్ఐ నెట్‌వర్క్ స్మాష్!

**మొదటి పేజీ తరువాయి**

చేశామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో అమిత్ షా పోస్ట్ పెట్టారు. 'దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు మోదీ సర్కార్ 200 మందికి పైగా షహజాద్ భట్టి నెట్‌వర్క్ ఆపరేటివ్‌లను అరెస్టు చేసింది. ఈ క్రమంలో ఐఎస్ఐ మద్దతుగల ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను నాశనం చేసింది. విధ్వంసక దాడులకు షహజాద్ భట్టి నెట్‌వర్క్ వేసిన ప్రణాళికలను భగ్నం చేసింది. ఉగ్రవాదం పట్ల భారత్‌కు ఉన్న జీరో టాలరెన్స్‌కు ఇదొక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుంది. భారత భద్రతా దళాలు 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో సమన్వయంతో కూడిన ఆపరేషన్లను ప్రారంభించి షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను చిన్నాభిన్నం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ సంస్థ నుంచి ఐఈడీలు, పాక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టల్స్, తూటాలు, గూఢచర్యానికి ఉపయోగించే సీసీటీవీ కెమెరాలతో సహా భారీ మొత్తంలో సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. షహజాద్ భట్టి నెట్‌వర్క్ అనేక ఉగ్రవాద కార్యకలాపాలలో పాలుపంచుకుంది' అని అమిత్ షా పేర్కొన్నారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఐఎస్ఐ మద్దతు గల ఉగ్ర సంస్థ షహజాద్ భట్టి నెట్‌వర్క్‌కు దేశంలో జరిగిన గ్రెనేడ్, ఐఈడీ, పెట్రోల్ బాంబు దాడులు, లక్షిత హత్యలతో సంబంధం ఉంది. పోలీసులు, రక్షణ, మతపరమైన ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించడానికి, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి స్థానిక మధ్యవర్తులకు ఈ నెట్‌వర్క్ డబ్బు ఇస్తోంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ (ఉపా) చట్టం, భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద షహజాద్ భట్టి గ్యాంగ్‌పై 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. సీమాంతర ఉగ్రవాదం పట్ల దేశ జీరో టాలరెన్స్ విధానంలో భాగంగా 14 రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్‌కు చెందిన 253 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ (62), హరియాణా (52), ఢిల్లీ (51), పంజాబ్ (44), రాజస్థాన్ (15), మహారాష్ట్ర (8), ఉత్తరాఖండ్ (5), కర్ణాటక, గుజరాత్, బిహార్‌లో చెరో ముగ్గురు, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, కేరళలో చెరో ఇద్దరు భట్టి నెట్‌వర్క్ ఆపరేటివ్‌లను అరెస్ట్ చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాది షహజాద్ భట్టికి సంబంధించిన మూడు ఉగ్రవాద గ్యాంగ్‌స్టర్ నెట్‌వర్క్ కేసులకు సంబంధించి ఎన్ఐఏ ఇటీవలే పంజాబ్, హరియాణాలలో 18 చోట్ల సోదాలు చేపట్టింది. ఉగ్ర కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించేందుకు కొంత మందిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టింది.

## ఫైర్‌బ్రాండ్ ఈజ్ బ్యాక్

**మొదటి పేజీ తరువాయి**

ఏపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి, కేంద్ర కార్యాలయం ఇంఛార్జ్‌గా తరుణ్ చుగ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఓబీసీ విభాగం అధ్యక్షుడిగా ఉన్న లక్ష్మణ్‌ను తప్పించి అమర్‌పాల్ మౌర్యను నియమించారు. ఆప్ నుంచి ఇటీవలే పార్టీలో చేరిన సందీప్ పాఠక్‌కు జాతీయ కార్యదర్శిగా నియమించారు. సీనియర్ నేత సంబిత్ పాత్రాకు ఈశాన్య ప్రాంతాల కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు కట్టబెట్టారు. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులలో ఆరుగురు మహిళలు ఉండటం, పార్టీ కీలక పదవులలో వారికి మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రయత్నాన్ని సూచిస్తోంది. ముస్లిం వర్గానికి చెందిన ఇద్దరితో పాటు నలుగురు మహిళా కార్యదర్శులు, ఒక మహిళా ప్రధాన కార్యదర్శి కూడా ఉన్నారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఈశాన్య రాష్ట్రాలకు చెందిన నేతలకు ముఖ్య కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులు లభించాయి. ఉపాధ్యక్షులుగా తీరథ్ సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), రామ్‌మాధవ్ (ఢిల్లీ), వైజయంత్ జే పాండే (ఒడిశా), పురందేశ్వరి (ఆంధ్రప్రదేశ్), రేఖా వర్మ (ఉత్తర్ ప్రదేశ్0, సర్దార్ సింగ్ బాదల్ (పంజాబ్), వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి (గుజరాత్), డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ (మహారాష్ట్ర), లాల్ సింగ్ ఆర్య (మధ్యప్రదేశ్), ఎం నాగరాజ్ (కర్ణాటక), తారిక్ మన్సూర్ (ఉత్తర్ ప్రదేశ్), మధుచందా కర్ (పశ్చిమ్ బెంగాల్). జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా ఉన్న బీఎల్ సంతోష్‌ను కొనసాగించారు. ముంబయికి చెందిన శివ్ ప్రకాష్, చండీగఢ్‌కు చెందిన సౌదాన్ సింగ్ సంయుక్త ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. మీడియా కోఆర్డినేటర్‌గా అనిల్ బలూని, ఆశిష్ ఉషా అగర్వాల్, ప్రదీప్ భండారి, సిద్ధార్థ్ యాదవ్ సంయుక్త కోఆర్డినేటర్లుగా నియమించారు. దీపక్ మస్కేను సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా, ప్రీతి గాంధీ, శివానంద్ ద్వివేది, అలోక్ భట్, అరుణ్ యాదవ్ సంయుక్త కోఆర్డినేటర్లుగా నియమితులయ్యారు. వచ్చే ఏడాది ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీలో బీజేపీ సమూల మార్పులు చేపట్టింది.

## విమాన చార్జీలు పెంచితే మా తడాఖా చూపిస్తాం

**మొదటి పేజీ తరువాయి**

హెచ్చరించింది. ప్రైవేట్ ఎయిర్ లైన్స్ యథేచ్ఛగా టికెట్ ధరలను పెంచుతున్నాయని దాఖలైన పిటిషన్ ను విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం.. విమానయాన సంస్థలు నిబంధనలకు కట్టుబడి లేకపోతే.. వారి సర్వీసుల్ని నిలిపివేసేందుకు కూడా వెనుకాడమని వ్యాఖ్యానించింది. పండుగలు, ఇతర సెలవుల సమయంలో ప్రైవేట్ సంస్థలు విపరీతంగా చార్జీలు పెంచి వసూలు చేస్తున్నాయని, ప్రభుత్వ అధికారిక మెమోరాండం కూడా అమలు కావడం లేదని సామాజిక కార్యకర్త ఎస్. లక్ష్మీ నారాయణన్ తమ పిటిషన్లో పేర్కొన్నారు. విమాన చార్జీల నియంత్రణకు స్పష్టమైన నిబంధనలు రూపొందించే ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, కేంద్రప్రభుత్వం తరఫున హాజరైన అడిషినల్ సొలిసిటర్ జనరల్ అనిల్ కౌశిక్ సుప్రీంకోర్టుకు వెల్లడించారు. ప్రతిపాదిత నిబంధనలతో కూడిన ముసాయిదాను కేంద్రం సీల్డ్ కవర్లో కోర్టుకు అందించగా.. మిగతా ప్రక్రియను పూర్తిచేసేందుకు మూడువారాల సమయం కావాలని కోరింది. అయితే.. ఈ ఏడాది మే నెలలో జరిగిన విచారణలోనే ప్రయాణికులకు రిలీఫ్ ఇచ్చేలా చార్జీలు ఉండాలి కానీ.. ఒకేరోజు ఒకే రూట్లో ప్రయాణించే విమానాల టికెట్ల ధరల్లో చాలా తేడాలుండటం ఆందోళనకరమని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. విమాన చార్జీల నియంత్రణకు ప్రత్యేక రెగ్యులేటరీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరగా, కేంద్ర ప్రభుత్వ అభ్యర్థనను అంగీకరించిన సర్వోన్నత న్యాయస్థానం 3 వారాల గడువు ఇచ్చింది.

# సారీ.. తప్పైంది!

**మొదటి పేజీ తరువాయి**

సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉన్నతస్థాయి కమిటీ వారానికోసారి సమావేశమై దరఖాస్తులు, ఇతర సమస్యలపై సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి వివరించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఈ నాలుగు జిల్లాల్లోనే సమస్య ఎక్కువగా ఉందని, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 511 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటితోపాటు మిగిలిన జిల్లాల్లో 22(ఏ) దరఖాస్తులన్నింటినీ ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇందుకోసం అవసరమైతే స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలంటూ సూచించినట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. నిషేధిత భూములపై సమాచారానికి టోల్‌ఫ్రీ నంబరు 1800 5994788ను ఏర్పాటు చేశామని, ఎవరైనా దీనికి సమాచారం పంపినా కనీసం 3 రోజుల్లో సమాధానం అందుతుందని, పరిష్కారానికి చర్యలు చేపడతారని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేని కేసుల్లో ఎందుకు చేయలేమో? ప్రజలకు స్పష్టమైన కారణం చెప్పాలని అధికారులకు సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే నిబంధనల ప్రకారం తిరిగి వారికి చెల్లించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని భూదాన్ భూములు, వాటికి సంబంధించిన పెండింగ్ సమస్యలు, వివాదాలు, పరిష్కార మార్గాలపై సమగ్ర నివేదిక రూపొందిస్తామని తెలిపారు. యూఎల్‌సీ(అర్బన్ ల్యాండ్ సీలింగ్) జాబితాను సరిచేస్తున్నామని, అసలైన హక్కుదారులకు న్యాయం చేస్తూ మరో రెండు రోజుల్లో తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఒక ఆస్తికి సర్వే శాఖ నుంచి టీఎస్ఎల్ఆర్, సర్వే నంబర్లు ఇవ్వగా, అదే ఆస్తికి జీహెచ్ఎంసీ కూడా ఇచ్చిందని, ఈ రెండింటినీ సూపర్ ఇంపోజ్ చేసే సమయంలో సమస్యలు ఏర్పడ్డాయని, వీటిని కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. రంగారెడ్డి జిల్లాలో 12 ఎకరాల భూమి ఉంటే అందులో రెండు ఎకరాలు భూదాన్ భూములు ఉండగా, మొత్తం 12 ఎకరాలను 22(ఏ)లో పెట్టడంతో సమస్య ఉత్పన్నమైనట్లు తెలిపారు. అదేవిధంగా కొన్ని దేవాదాయ, అటవీ భూములు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయని, జియో ట్యాగింగ్ ద్వారా అసలు స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసి మిగిలిన భూములను ఫ్రీహోల్డ్ చేయాలంటూ ఆదేశించినట్లు తెలిపారు. గతంలో హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో అప్పట్లో అధికారులు నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలను వదిలేయడంతో అవి నేటికీ నిషేధిత జాబితాలో ఉండిపోయాయన్నారు. అధికారుల చర్యలతో సామాన్యులు కూడా ఇబ్బంది పడినట్లు ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి పొంగులేటి ప్రజలకు 22(ఏ) విషయంలో క్షమాపణలు చెప్పారు. అయితే అధికారులపై నెపం నెట్టి తమ ప్రభుత్వం ఈ సమస్యను ప్రజలపై వదిలేయడం లేదని, దీనిని పరిష్కరించే బాధ్యత కూడా తానే తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. నిషేధిత భూముల పేరిట అసలైన యజమానులకు ఎటువంటి అన్యాయం జరగదని మంత్రి హామీ ఇచ్చారు. ఓ వైపు ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూనే భవిష్యత్తులో ఎటువంటి పొరపాట్లు జరగనివ్వబోమని వెల్లడించారు.

## పెరిగిన స్మార్ట్ ఫోన్ల ధరలు

**మొదటి పేజీ తరువాయి**

మిగిల్చాయి. వన్‌ప్లస్, పోకో, రెడ్‌మీ, ఐకూ వంటి ప్రముఖ బ్రాండ్లు తమ ఫోన్ల ధరలను సవరించాయి. వన్‌ప్లస్ తన నార్డ్ 6 సిరీస్ ఫోన్లపై రూ. 4,000 వరకు ధరను పెంచగా, ఐకూ 15 మోడల్‌పై గరిష్ఠంగా రూ. 8,000, ఐకూ 15ఆర్ మోడల్‌పై రూ. 5,000 వరకు పెంచింది. పోకో ఎక్స్8 ప్రో, ప్రో మ్యాక్స్ వేరియంట్లపై రూ. 5,000, రెడ్‌మీ టర్బో 5పై రూ. 5,000 మేర ధరలు పెరిగాయి. ఒప్పో, వివో కంపెనీలు సైతం తమ పలు మోడళ్ల ధరలను రూ. 4,000 నుండి రూ. 5,000 వరకు పెంచాయి. పారిశ్రామిక నివేదికల ప్రకారం, మెమరీ చిప్‌ల ధరలు పెరగడమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా డీ-ర్యామ్, నాండ్ ఫ్లాష్ మెమరీ చిప్‌లకు తీవ్ర కొరత ఏర్పడింది. ముఖ్యంగా ఏఐ డేటా సెంటర్ల నుంచి డిమాండ్ పెరగడంతో వీటి ధరలు ఆకాశాన్నంటాయి.

## 261 మండలాల్లో లోటు వర్షపాతం

**మొదటి పేజీ తరువాయి**

గణాంకాల ప్రకారం.. ఇప్పటికీ రాష్ట్రంలోని 15 జిల్లాల్లో, ఏకంగా 261 మండలాల్లో తీవ్రమైన లోటు వర్షపాతం కొనసాగుతోంది. 264 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. అత్యంత లోటు వర్షపాతం 8 మండలాల్లో ఉంది. వర్షాకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దేశంలో ఎల్ నినో ప్రభావం క్రమంగా బలపడుతుండడంతో రానున్న రెండు వారాల్లో వర్షపాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏర్పడే ఈ ప్రతికూల పరిస్థితుల కారణంగా దేశవ్యాప్తంగా సాధారణం కంటే దాదాపు 12 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేసింది. వర్షాలు తగ్గడంతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లోని పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 4 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 30 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ములుగు జిల్లా వెంకటాపురంలో 36.7, సూర్యాపేట జిల్లా నాగారంలో 36.4, ఖమ్మం జిల్లా తల్లాడలో 36.4, మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ లో 35.9, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలంలో 35.6, నారాయణ్ పేట్ జిల్లా క్రుష్ణాలో 35.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా రాజన్నసిరిసిల్ల జిల్లా నేరెళ్లలో 5.3 సెం.మీ, నామపూర్ లో 4.7, ఇల్లంతకుంటలో 4.5, నిజామాబాద్ జిల్లా మంచిప్పలో 3.9, రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దలింగాపురంలో 3.8 సెం.మీ, ఎల్లారెడ్డిపేటలో 3.6 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

## పేరు మార్చితే చరిత్ర మారుతుందా?

**మొదటి పేజీ తరువాయి**

పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నది కేసీఆర్ ఆలోచన. కరోనా తర్వాత భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, వందేళ్ల ముందు చూపుతో కేసీఆర్ టిమ్స్‌లకు రూపకల్పన చేశారన్నారు. 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు మూడు ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ దవాకానలకు శంకుస్థాపన చేసి చరిత్ర సృష్టించారు. ప్రణాళిక కేసీఆర్‌ది.. శంకుస్థాపన కేసీఆర్‌ది.. నిధులు విడుదల చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఒక్కో ఆసుపత్రి వెయ్యి పడకల సామర్థ్యంతో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరుతో నిర్మించే మూడింటి నిర్మాణానికి రూ. 2,679 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో శరవేగంగా సాగిన పనులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నత్తనడకన సాగాయి. సకాలంలో పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మూడున్నరేళ్ల సుదీర్ఘ కాలంలో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించకుండా, కేవలం ప్రచారం కోసం సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తున్నారు. కనీసం హాస్పిటల్‌కు నీటి సరఫరా కూడా కల్పించలేదు అంటే పేదల వైద్యం పట్ల వీరికి ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం అవుతుంది. కేసీఆర్ పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆలోచిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల నుంచి ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండ్లు తెరవండి. కేసీఆర్ ఎంతో ముందుచూపుతో మొదలు పెట్టిన టిమ్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

## పరీక్షలన్నీ రద్దు

**మొదటి పేజీ తరువాయి**

సమావేశమవుతాం. అవసరమైతే ఈ అంశంపై చర్చించడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను కూడా నిర్వహిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. సిట్, సీఐడీ చేసిన దర్యాప్తులో అనేక దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. ప్రస్తుతం ఇంకా విచారణ కొనసాగుతున్నందన, ప్రతి విషయాన్ని బహిరంగా వెల్లడించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

# మండల స్థాయి ప్రజావాణి విజయవంతం

## 565 ఎంపీడీవో కార్యాలయాల్లో కార్యక్రమం.. మొత్తం 5,410 వినతులు స్వీకరణ: ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 17 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే నేరుగా స్వీకరించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించగా, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ ప్రజావాణి చేపట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రజావాణి రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ జీ. చిన్నారెడ్డి, రాష్ట్ర నోడల్ అధికారి కే. విద్యాసాగర్ తెలిపారు. మండల స్థాయి ప్రజావాణిలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 5,410 వినతులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారులకు నేరుగా వివరించి, పరిష్కారం కోసం వినతులు సమర్పించారు. ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజల సౌకర్యార్థం మండల ప్రజావాణి కార్యక్రమాల్లో శాఖల వారీగా ప్రత్యేక కౌంటర్లు, సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజలు సమర్పించిన వినతులను నేరుగా స్వీకరించడంతో పాటు, సమస్యలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులు దృష్టి సారించారు.

**కరీంనగర్‌లో అత్యధిక వినతులు**

రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో జిల్లాకు సగటున 164 వినతులు అందాయి. జిల్లాల వారీగా అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 704 వినతులు స్వీకరించారు. ఒక్కో మండలానికి సగటున అత్యధిక వినతులు అందిన జిల్లాగానూ కరీంనగర్ ముందంజలో నిలిచింది. ఆ జిల్లాలో ఒక్కో మండలానికి సగటున 47 వినతులు అందాయి. మండల స్థాయిలోనే ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించడం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా లేదా రాష్ట్ర స్థాయి కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సంబంధిత అధికారులను కలిసి సమస్యలను వివరించే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు.



**ప్రజలు, అధికారుల నుంచి స్పందన**

మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, అధికారుల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతులు సమర్పించగా, అధికారులు కూడా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించి 5,410 వినతులను స్వీకరించారు. మండల స్థాయిలోనే ప్రజల సమస్యలను స్వీకరించి వాటికి వేగంగా పరిష్కారం చూపడమే ప్రజావాణి ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

# జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి



**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి**

హైదరాబాద్, ఆగస్టు 17 (ఈవార్తలు): జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులను 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక స్మార్ట్ సిటీకి రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో పారిశ్రామిక కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నిర్వహించిన జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు సంస్థ సమావేశంలో శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వీసీ ద్వారా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల శాఖ మంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం భూమి రూపంలో 51 శాతం వాటాను సమకూరుస్తుండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందిస్తోంది. ఇప్పటికే ప్రత్యేక ప్రయోజన సంస్థకు అభివృద్ధి ప్రణాళికను సమర్పించినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. ఇంజనీరింగ్, సేకరణ, నిర్మాణ విధానంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. నీటి సరఫరా పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, విద్యుత్ సరఫరా పనులను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు. భారత్ పారిశ్రామిక అభివృద్ధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 సిద్ధంగా వినియోగించుకునే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ పార్కులు దోహదపడతాయని తెలిపారు. సమావేశంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ఇల్లూ నిషేధిత జాబితాలోనే

**జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు**

**మాజీమంత్రి హరీశ్ రావు మండిపాటు**

హైదరాబాద్, ఆగస్టు 17 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి నివాసానికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్య ప్రజల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో విచారణ జరపాలని, ఆ జాబితాలో ఉన్న ఆస్తులు పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆయన విమర్శించారు.

# బీజేపీ కోర్ టీంలో ఆరెస్సెస్ ముద్ర

**ఆరేళ్ల తర్వాత బీజేపీ టీమ్‌లోకి రామ్ మాధవ్**

**సునీల్ బన్సల్, బీఎల్ సంతోష్‌కూ అవకాశం**

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీనియర్ నేత రామ్ మాధవ్ దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత తిరిగి పార్టీ జాతీయ కార్యవర్గంలోకి ప్రవేశించారు. పార్టీ నూతన అధ్యక్షుడు నితిన్ నబిన్ ప్రకటించిన నూతన కార్యవర్గంలో రామ్ మాధవ్‌ను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న పలువురు నేతలు ఈ కొత్త బృందంలోనూ తమ కీలక స్థానాలను నిలబెట్టుకోవడం గమనార్హం. గతంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా, జాతీయ అధికార ప్రతినిధిగా సేవలందించిన రామ్ మాధవ్, 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్‌లో పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేశారు. కశ్మీర్‌లో బీజేపీ–పీడీపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటులో ఆయనది కీలక పాత్ర. అయితే, 2020లో జేపీ నడ్డా నేతృత్వంలోని కార్యవర్గంలో ఆయనకు స్థానం లభించలేదు. అప్పటి నుంచి ఆయన ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా చురుగ్గా కొనసాగుతున్నారు. తాజా నియామకం వెనుక ప్రధాని నరేంద్ర మోదీ చొరవ ఉన్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. సాధారణంగా ఉపాధ్యక్ష పదవి అలంకారప్రాయంగానే భావించినప్పటికీ, రామ్ మాధవ్‌కు మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పార్టీ బలోపేతానికి ఆయన అనుభవాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలని అధిష్ఠానం యోచిస్తోంది.

# ఇటలీ నేషనల్ కాంగ్రెస్

## వందేమాతరం అంటే కాంగ్రెస్‌కు వణుకు.. కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజం

తిరుపతి, ఆగస్టు 17 (ఈవార్తలు): దేశం నుంచి కాంగ్రెస్, ఎంఐఎంలను తరిమికొట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తిరుపతిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వందేమాతరం గీతాన్ని అవమానించడం సిగ్గుచేటని, సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గేలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వందేమాతరం చరిత్రను సోనియాగాంధీ తెలుసుకోవాలని కోరారు. దేశం మారితే సరిపోదని, దేశం విలువలు, సంస్కృతి, వేల ఏళ్ల చరిత్ర తెలిసి ఉండాలన్నారు. 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదది... ఇటలీ నేషనల్ కాంగ్రెస్' అని ఎద్దేవా చేశారు. వందేమాతరం గీతాన్ని విని ఆనాడు బ్రిటిష్ భయపడిందని, వందేమాతరం పూర్తి గీతాన్ని చూసి కాంగ్రెస్ వణుకుతోందన్నారు. విద్యార్థుల్లో విపక్షాలు విష బీజాలు నింపాయని, విపక్షాల మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించాలని యువతను కోరుతున్నానని తెలిపారు. వాస్తవాలను గ్రహించకపోతే విద్యార్థులు మోసపోతారని, వందేమాతరాన్ని కాంగ్రెస్ అవమానించడంపై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎన్నటికీ ఒక్కటి కాదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని, గతంలో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేసి అధికారం పంచుకున్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం నడుస్తోందని, అందుకే బీఆర్ఎస్ అవినీతి కేసులన్నీ అటకెక్కాయని అన్నారు. సిట్ కు అప్పగించిన కేసులన్నీ సీఎం సిట్ అంటే సిట్ స్టాండ్ అంటే స్టాండ్ అంటున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతి కేసులు కాంగ్రెస్ కు ఏటీఎంలా మారాయని, బీఆర్ఎస్ అవినీతి బయటకు వచ్చినప్పుడల్లా కాంగ్రెస్ నేతలకు మూటలు అందుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్‌కు మూటలు అప్పగించగానే బీఆర్ఎస్ అవినీతి కేసులన్నీ ఒక్కొక్కటిగా క్లోజ్ అవుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అడ్రస్ లేకుండా పోయాయని, ఆ రెండు పార్టీలను తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కోరుకుంటున్నారని, అప్పులు తీరి అభివృద్ధి జరగాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణలో సింగిల్ గా పోటీ చేసి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తంచేశారు. తిరుపతిలో సీఆర్పీఎఫ్‌కు సంబంధించి నూతనంగా నిర్మించిన ఆఫీసర్స్ మెస్, సబార్డినేట్ ఆఫీసర్స్ మెస్, రిక్రియేషన్ క్లబ్, స్టోర్, ట్రేడ్స్‌మెన్ బ్లాక్ భవనాల సముదాయాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఇందులో రూ.9.47 కోట్లతో ఆఫీసర్స్ మెస్, రూ.7.9 కోట్లతో సబార్డినేట్ మెస్, రూ.4.9 కోట్లతో రిక్రియేషన్ క్లబ్, రూ.4.55 కోట్లతో స్టోర్ బ్లాక్ భవనాలను నిర్మించారు. ఆయా భవనాలను నేడు కేంద్ర మంత్రి బండి సంజయ్ జాతికి అంకితం చేయడం గమనార్హం. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఏడీజీ సౌత్ జోన్ రవిదీప్ సింగ్ సాహి, ఐజీ దినేష్ ప్రతాప్ ఉపాధ్యాయ్, బ్రిగేడియర్ అనుపమ్ శర్మ, డీఐ సుభాష్ చంద్ర శర్మ, చీఫ్ ఇంజనీర్ సీఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఆర్పీఎఫ్ జవాన్లను ఉద్దేశించి కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. సీఆర్పీఎఫ్ బలగాలకు అందిస్తున్న మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. దేశ భద్రత, సార్వభౌమత్వం కోసం మీ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని, అందుకే మీకు సాధ్యమైనంత మెరుగైన, ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.



# డీఎస్సీపై సీబీఐ విచారణ చేపట్టాల్సిందే

**ఏపీ మండలిలో బొత్స సత్యనారాయణ డిమాండ్**

అమరావతి, ఆగస్టు 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు మెగా డీఎస్సీ వివాదంతో తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం చేపట్టిన టీచర్ నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్ష వైసీపీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. దీనిపై సభలో సమగ్ర చర్చ జరగాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలు, స్పోర్ట్స్ కోటా కేటాయింపుల్లో అవకతవకల్లో నిజాలు బయటకు రావాలంటే సీబీఐ విచారణ ఒక్కటే సరియైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించడంతో సభలో ఒక్కసారిగా కలకలం రేగింది. కూటమి ప్రభుత్వం 'మెగా డీఎస్సీ' పేరుతో నిరుద్యోగులను 'దగా డీఎస్సీ'గా మోసం చేసిందని విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. పరీక్షలు రాయని వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయని, ఉద్యోగాల బేరసారాలకు సంబంధించిన ఆడియో టేపులు బయటకు వచ్చినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక మర్మమేంటని బొత్స ప్రశ్నించారు. ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం చర్చ నుంచి పారిపోతోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 నియామకాలపై అధికార పక్షం చేస్తున్న ఆరోపణలనూ ప్రస్తావించారు. నిజంగా గ్రూప్–1లో అక్రమాలు జరిగాయని భావిస్తే, దానితో పాటు ప్రస్తుత డీఎస్సీ ప్రక్రియపై కూడా ఒకేసారి సీబీఐ విచారణ వేయాలని ఆయన సవాల్ విసిరారు.

# 8 మత్స్యకారుల గల్లంతు!

వైజాగ్, ఆగస్టు 17 (ఈవార్తలు): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరిగిరాకపోవడంతో ఏపీలోని కోనసీమ జిల్లాలో తీవ్ర కలకలం రేగింది. అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన బోటులో ఈ నెల 3న ఎనిమిది మంది మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లారని, నిర్ణీత గడువు ప్రకారం ఈ నెల 13 నాటికే తిరిగి రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒడ్డుకు చేరలేదని జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ తెలిపారు. మత్స్యకారుల వద్ద 15 రోజులకు సరిపడా రేషన్ నిల్వలు, 1,000 లీటర్ల డీజిల్ మాత్రమే ఉంది.

# నాగబాబుకు కేబినెట్ హోదాతో పదవి

**చంద్రబాబుకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు**

అమరావతి, ఆగస్టు 17 (ఈవార్తలు): జనసేన సీనియర్ నేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో, నాగబాబు సోదరుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి పక్షాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నాగబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. నాగబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ, "వికసిత్ ఆంధ్రప్రదేశ్–2047 సాధనలో భాగంగా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం పచ్చదనం సాధించాలనే లక్ష్యాన్ని ఆయన సమర్థమైన నాయకత్వంలో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. అటవీ విస్తీర్ణం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు నాగబాబు నాయకత్వంలో మరింత వేగవంతంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలకు పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కీలక బాధ్యతలో నాగబాబు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో జనసేన నేతకు కేబినెట్ హోదాతో పదవి లభించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# కల్యాణలక్ష్మి కొనసాగిస్తాం: పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 17 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికర పథకాలు సాధ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని ఆయన తేల్చిచెప్పారు. అయితే ఈ సంక్షేమ పథకాలకు సంబంధించి ఒక ప్రైవేట్ వ్యక్తి కోర్టులో పిటిషన్ వేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పేదరికంపై పోరాడుతున్న ఇలాంటి సంక్షేమ పథకాలపై కోర్టులో కేసులు వేయడం వెనుక ఉన్న ఉద్దేశాలను ఆయన ప్రశ్నించారు. ఈ పిటిషన్‌పై అధికారులు ఎందుకు సకాలంలో కౌంటర్ దాఖలు చేయలేదనేదానిపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించిందని, దీనిపై అంతర్గతంగా ఆరా తీస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎప్పుడూ ఎలాంటి బేషజాలకు పోకుండా, కేవలం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని మంత్రి పునరుద్ఘాటించారు. రాజకీయాలకు అతీతంగా, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, పేదల బతుకుల్లో వెలుగులు నింపే సంక్షేమ పథకాలను ఆపే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షేమనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.



**పథకం నీరుగార్చే కుట్ర: ఆర్ఎస్పీ**

తెలంగాణలో పేదల సంక్షేమానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ పథకాలను యథాతథంగా కొనసాగించాలని, అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భరత్ కుమార్ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన భారీ ధర్నాలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ పథకాలపై కోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసి కూడా, కావాలనే ప్రభుత్వం తరఫున సరైన వాదనలు వినిపించకుండా కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు వచ్చేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉన్నప్పటికీ, ఈ సంక్షేమ పథకాలను నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతుండటం విచారకరమన్నారు. అలాగే నల్గొండ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుని అనర్హులకు ఇచ్చారని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొంది. జాయింట్ కలెక్టర్ మెమోరాండం స్వీకరించేందుకు రాగా బీఆర్ఎస్ నాయకులు ఇచ్చేందుకు నిరాకరించారు. చివరకు గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌ను కలవడానికి పోలీసులు అనుమతించడంతో, నాయకులు కలెక్టర్‌ను నేరుగా కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై స్పష్టత ఇవ్వాలి

## ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలి.. మంత్రి పొంగులేటికి టీడబ్ల్యూజేఎఫ్ వినతి

హైదరాబాద్, ఆగస్టు 17 (ఈవార్తలు): జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సచివాలయంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. రాష్ట్రంలోని అన్ని కేబుల్ టెలివిజన్ వార్తా ఛానళ్లకు వెంటనే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఫెడరేషన్ నాయకులు కోరారు. ఇంటర్నెట్ ప్రోటోకాల్ ఆధారిత వార్తా ఛానళ్లకు కూడా గుర్తింపు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేబుల్ ఛానళ్లకు జిల్లా స్థాయిలో నాలుగు, రాష్ట్ర స్థాయిలో 12 గుర్తింపు కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గుర్తింపు కార్డులు మంజూరవుతున్నప్పటికీ ఆరోగ్య కార్డుల విషయంలో జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా చట్టపరమైన మార్గాలను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఫెడరేషన్ కోరింది. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రత్యేక సహాయం, సంక్షేమ చర్యలు అందించాలన్నారు.



చిన్న, మధ్యతరహా పత్రికలకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల జాబితాలో చేర్చి వాటి మనుగడకు సహకరించాలని కోరారు. సీనియర్, విశ్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించి, జర్నలిస్టు మృతి చెందిన సందర్భంలో కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం అందించేలా పథకాన్ని అమలు చేయాలని విన్నవించారు. జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, సహ కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్. రవికుమార్ తదితరులు ఉన్నారు.

# 'పీఎంజే' దోపిడీ ముఠాపై పీడీ యాక్ట్



కరీంనగర్, ఆగస్టు 17: కరీంనగర్ పట్టణంలోని పీఎంజే జ్యువెలర్స్‌లో జరిగిన దోపిడీ కేసులో ప్రధాన నిందితులైన ఐదుగురు ముఠా సభ్యులపై పోలీసులు పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. 2026 మే 3న పీఎంజే జ్యువెలర్స్‌లోకి చొరబడిన నిందితులు సిబ్బందిపై తుపాకులతో కాల్పులు జరిపి సుమారు రూ.82 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ప్రధాన నిందితులైన ఐదుగురిపై సోమవారం పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. పీడీ చట్టం కింద నిర్బంధించిన వారిలో రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జాగీరా సింగ్ (41), పశ్చిమ బెంగాల్, రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమాన్ (23), నలంద జిల్లా, బిహార్, సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్ (21), నలంద జిల్లా, బిహార్, యాదవ్ అలియాస్ జైనుల్ అబ్దిన్ (33), ఫుల్వారీ షరీఫ్, పాట్నా జిల్లా, బిహార్, మొహమ్మద్ ఆదిల్ ఖాన్ (31), ఫుల్వారీ షరీఫ్, పాట్నా జిల్లా, బిహార్‌కు చెందినవారు ఉన్నారు. నిందితులు పునరావృతంగా నేరాలకు పాల్పడకుండా అడ్డుకోవడం, ప్రజల భద్రతకు భరోసా కల్పించడం, నేరాలకు పాల్పడే వారిలో చట్టంపై భయాన్ని కలిగించడమే లక్ష్యంగా పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను కరీంనగర్ జిల్లా జైలులో నిందితులకు అందజేసి, అనంతరం వారిని చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. పీడీ చట్టం అమలులో కీలకంగా వ్యవహరించిన కరీంనగర్ పట్టణ సహాయ పోలీస్ కమిషనర్ ఎన్. వెంకటస్వామి, కరీంనగర్ రెండో పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కె. సృజన్‌రెడ్డిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు. నేరాలకు పాల్పడే వారిపై కరీంనగర్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే నేరస్థులపై చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థులకు సంపూర్ణ మద్దతు

**జీవో 97పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి**

**బీఆర్ఎస్ నేత రంజిత్ రెడ్డి డిమాండ్**




వరంగల్, ఆగస్టు 17 (ఈవార్తలు): పాలిటెక్నిక్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకుడు దుగ్గింపూడి రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావం తెలిపిన ఆయన, విద్యార్థుల డిమాండ్లతో ఆరు భాషల్లో రూపొందించిన పోరాట గీతం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్, సాంకేతిక విద్యా వ్యవస్థకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 97లోని 'శక్తి' కార్యక్రమంపై విద్యార్థుల్లో అనేక అనుమానాలు, అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అంశంపై విద్యార్థులకు పూర్తి స్పష్టత ఇవ్వాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్ విద్య, ఉద్యోగ అవకాశాలు, పరీక్షలు, ఫలితాలు, ధ్రువపత్రాలు, విద్యా ప్రణాళికకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే పాలిటెక్నిక్ విద్య పూర్తయిన తర్వాత విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలో డిగ్రీ చదివే అవకాశం కల్పించాలని కోరారు. విద్యార్థుల సమస్యలు, అభ్యంతరాలను తెలుసుకునేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణులతో సమగ్రంగా చర్చించిన తర్వాతే కొత్త జీవోను అమలు చేయాలని సూచించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు రంజిత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుండా పోలీసుల ద్వారా విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తే విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# కొండగట్టు వద్ద బస్సు-లారీ ఢీ

**24 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం**

మల్యాల, ఆగస్టు 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 24 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి నిజామాబాద్ వెళ్తుండగా.. కొండగట్టు స్టేజి దాటిన తర్వాత మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ బస్సును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 60 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. సుజాత పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.




# యువతకు కెరీర్‌తో పాటు క్యారెక్టర్ ముఖ్యం

వేములవాడ అర్బన్, ఆగస్టు 17 (ఈవార్తలు): యువతకు వృత్తి, ఉద్యోగ భవిష్యత్తుతో పాటు వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు ఎంతో ముఖ్యమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కరీంనగర్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్ అన్నారు. వేములవాడలోని త్రినేత్ర ఫంక్షన్ హాల్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సంఘం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యుడు డాక్టర్ చీకోటి సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ భారతదేశానికి అపారమైన యువశక్తి ఉందని, దేశ జనాభాలో సుమారు 65 శాతం యువతేనని తెలిపారు. యువతలో దాగి ఉన్న శక్తి అపారమైనదని, వారు సంకల్పిస్తే సాధించలేనిది ఏమీ లేదన్నారు. అయితే నేటి యువతలో కొందరు మొబైల్ ఫోన్లు, మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం సేవించడాన్ని ఒకప్పుడు తప్పుగా భావించేవారని, ప్రస్తుతం కొందరు దానిని ఫ్యాషన్, సంస్కృతిగా భావించే పరిస్థితి రావడం విచారకరమన్నారు. స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వంటి మహనీయులు యువకులుగానే ధైర్యసాహసాలు ప్రదర్శించి లక్ష్య సాధన దిశగా ముందుకు సాగారని గుర్తుచేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ జీవన విలువలను అలవరుచుకుని దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

# జయవరం గ్రామానికి 'కరెంట్' తిప్పలు

**విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై సర్పంచ్ ఆగ్రహం**



వేములవాడ రూరల్, ఆగస్టు 17 (ఈవార్తలు): వేములవాడ రూరల్ మండలంలోని జయవరం గ్రామాన్ని తక్కువ వోల్టేజీ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. విద్యుత్ సరఫరాలో నెలకొంటున్న ఇబ్బందులపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ ఏంద్రియాల ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో విద్యుత్ అవసరాలు పెరిగినప్పటికీ ప్రస్తుతం కేవలం రెండు 15 కేవీ సామర్థ్యం కలిగిన విద్యుత్ పరికరాలతోనే సరఫరా కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. దీంతో తరచూ తక్కువ వోల్టేజీ సమస్య తలెత్తడంతో పాటు విద్యుత్ సరఫరా ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో వెంటనే 25 కేవీ సామర్థ్యం కలిగిన విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సంబంధిత సహాయ ఇంజినీర్‌కు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాడి రైతులు, విద్యార్థులు, గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఉన్నతాధికారులు స్పందించి జయవరం గ్రామానికి 25 కేవీ సామర్థ్యం కలిగిన పరికరాలను మంజూరు చేసి తక్కువ వోల్టేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ప్రభుత్వానికి భారంగా పేదలు

**కల్యాణలక్ష్మి రద్దుకు రేవంత్‌రెడ్డి కుట్ర.. దావ వసంత సురేష్ మండిపాటు**

**పెన్షన్ల కోసం బీడీ కార్మికులు, వృద్ధులతో కలిసి బీఆర్ఎస్ నిరసన**

జగిత్యాల, ఆగస్టు 17 (ఈవార్తలు): పేదల సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తోందని బీఆర్ఎస్ నాయకురాలు, జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం బీడీ కార్మికులు, వృద్ధులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతోపాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. నల్ల రిబ్బన్లు ధరించి, బీడీలు చుట్టుతూ నిరసన తెలిపిన అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగనామం పెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ పథకంపై కోర్టు స్టే విధించిన నేపథ్యంలో ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యం చేయడం వెనుక మర్మమేమిటని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆడబిడ్డలపై ప్రభుత్వానికి ఎందుకింత అక్కసు అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు ఆర్థిక సాయం అందించారని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని విమర్శించారు. రైతుబీమా, దళితబంధు తదితర సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వృద్ధులు, బీడీ కార్మికులకు పెన్షన్ల కింద రూ.4 వేల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ఇప్పటివరకు మంజూరు చేయకపోవడం దారుణమని వసంత సురేష్ అన్నారు. కేసీఆర్ హయాంలో అందిన పెన్షన్లను కొనసాగిస్తే చాలని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలతో పెట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని వసంత సురేష్ హెచ్చరించారు. సంక్షేమ పథకాలను అమలు చేయకపోతే మహిళలను కలుపుకుని భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తెలిపారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడం కంటే ముందుగా ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలకు తావులేకుండా పేదల పక్షాన ఆలోచించి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని బీఆర్ఎస్ తరఫున కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, శీలం ప్రవీణ్ ప్రియాంక, మునుభాయ్, గాజుల రాజేందర్, దుర్గయ్య, ముఖసిరల్లి నిహాల్, ఆసిఫ్, ఆసిన్ సావన్, ఇర్షాద్, కార్యకర్తలు, కౌన్సిలర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, పెన్షన్లు రాని బీడీ మహిళా కార్మికులు, కల్యాణలక్ష్మి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# మల్యాలలో 48 నూతన సీసీ కెమెరాలు ప్రారంభం

మల్యాల, ఆగస్టు 17 (ఈవార్తలు): మల్యాల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 48 సీసీ కెమెరాలను సోమవారం జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ప్రారంభించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలు నేరాల నియంత్రణ, దొంగతనాల నివారణ, ప్రమాదాల నియంత్రణలో ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్పీ తెలిపారు. ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని, నేరాలకు పాల్పడే వారిని గుర్తించడంలో కూడా ఇవి పోలీసులకు సహాయపడతాయని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ మల్యాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో మల్యాల సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ సందీప్, గ్రామపంచాయతీ సర్పంచ్ బొట్ల జయ, ఉపసర్పంచ్ కట్కాం వినయ్, కార్యనిర్వహణ అధికారి శ్రీకాంత్‌తో పాటు ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, ఆగస్టు 17 (ఈవార్తలు): జగిత్యాల: నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. పరమశివుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నారు. నాగుల పంచమి పర్వదినం సందర్భంగా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆమె పేర్కొన్నారు.



# అబాకస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

పద్మారావునగర్, ఆగస్టు 17 (ఈవార్తలు): సిప్ అబాకస్ ప్రాంతీయ ప్రతిభా పోటీలు-2026లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ట్రోఫీలతో పాటు పలు బహుమతులు సాధించారని పద్మారావునగర్ శాఖ నిర్వాహకురాలు అనురాధ రజనీకాంత్ తెలిపారు. సోమవారం పద్మారావునగర్‌లోని సిప్ అబాకస్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె అభినందించారు. చిన్నారుల్లో మానసిక గణన నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు సంఖ్యా సామర్థ్యం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మేధో వికాసానికి అబాకస్ ఎంతగానో దోహదపడుతుందని ఆమె అన్నారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, సాంకేతికతను చిన్న వయసు నుంచే అవగాహన చేసుకోవడంలో అబాకస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణా బోధకులు సుచరిత, కవిత, విద్య, సంఘమిత్రతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# 19న కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 17 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ 72వ జన్మదిన వేడుకలను సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు మహాసభ నాయకులు తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్ల సదానంద్ ముదిరాజ్, నగర అధ్యక్షుడు తోట సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఆగస్టు 19న ఉదయం 11 గంటలకు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, విశ్రాంత కలెక్టర్ జగన్మోహన్ ముదిరాజ్ హాజరవుతారని చెప్పారు. అభిమానుల సమక్షంలో కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కేక్ కట్ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ, స్వచ్ఛంద రక్తదాన శిబిరం, యువ క్రీడాకారులకు సన్మానం, ముదిరాజ్ ప్రముఖులకు సత్కారం నిర్వహించనున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో వెంకట్రావు ముదిరాజ్, పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, లక్ష్మీనారాయణ ముదిరాజ్, రాజారాం ముదిరాజ్, నర్సింగ్‌రావు ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

**రాజారంలో ఉచిత అర్జెంట్ కేర్ సెంటర్ ప్రారంభం**

జగిత్యాల, ఆగస్టు 17 (ఈవార్తలు): శ్రీ సత్యసాయి సుజల స్రవంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాయి స్వస్థ షా హ్యాపీనెస్ అర్జెంట్ కేర్ సెంటర్‌ను ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, డా. సంజయ్‌కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల, మల్యాల నియోజకవర్గాల పరిధిలోని ప్రజలకు ఉచిత అత్యవసర వైద్య సేవలు అందించేందుకు కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు సకాలంలో వైద్యం అందించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్, డీసీసీ అధ్యక్షుడు నందయ్య, కౌన్సిలర్ చాంద్ పాషా, రాజారం సర్పంచ్ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ట్రస్ట్ సభ్యులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# నాగుల పంచమికి ఆలయాల్లో భక్తుల సందడి

వేములవాడ అర్బన్, ఆగస్టు 17 (ఈవార్తలు): నాగుల పంచమి సందర్భంగా వేములవాడ పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మార్కండేయనగర్ సాయిబాబా దేవాలయంలోని పుట్ట వద్ద ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నాగదేవతకు పాలు పోసి పూజలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారమని భక్తులు తెలిపారు. నాగదేవతను పూజించి తమ కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రస్టు సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. శ్రావణ మాసంలోని తొలి సోమవారం, నాగుల పంచమి ఒకేరోజు రావడంతో పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

## బీడీ కార్మికులు, వృద్ధులకు పెన్షన్లు ఇవ్వాలి

**మెట్‌పల్లిలో ఎమ్మెల్యే డా సంజయ్ ధర్నా**

మెట్పల్లి, ఆగస్టు 17 (ఈవార్తలు): బీడీ కార్మిక మహిళలకు బీడీ పెన్షన్, వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా. కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో సోమవారం మెట్‌పల్లి పాత బస్‌స్టాండ్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. బీడీ కార్మిక మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. 2014లో అప్పటి సీఎం కేసీఆర్ బీడీ కార్మికుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. దేశంలోనే బీడీ కార్మికులకు ప్రత్యేక పెన్షన్ అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. తొలుత రూ. 1,000గా ఉన్న పెన్షన్‌ను రూ. 2,000కు పెంచి బీడీ కార్మిక మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారని అన్నారు. కేసీఆర్ హయాంలో లక్షలాది మందికి ఆసరా పెన్షన్లు అందించామని, క్లిష్ట పరిస్థితుల్లోనూ పెన్షన్లను నిలిపివేయలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా కొత్తగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లు మంజూరు చేయకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే విమర్శించారు. ఎన్నికల సమయంలో రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. కనీసం రూ. 2 వేల పెన్షన్ అయినా వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులు, వృద్ధులకు పెన్షన్లు అందించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని, కేసీఆర్ కిట్‌ను తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యే సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బీడీ కార్మిక మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మెట్‌పల్లి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. బీడీ కార్మిక మహిళలు, వృద్ధులకు వెంటనే పెన్షన్లు మంజూరు చేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

## అక్రమ నిర్మాణాలు తొలగించాలి

**ప్రజావాణిలో వెల్గటూర్ గ్రామస్థుల ఫిర్యాదు**

వెల్గటూర్, ఆగస్టు 17 (ఈవార్తలు): వెల్గటూర్ గ్రామంలోని రహదారులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ షాపులు, నిర్మాణాలను తొలగించాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు మండల ప్రజావాణిలో ఎంపీడీవో పాడి వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్లను ఆక్రమించి షాపులు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులను ఆక్రమించిన అన్ని షాపులు, నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరారు. గ్రామస్థులు మూగల శ్రీనివాస్, పొనగంటి రాజేందర్, గుమ్ముల రాజేష్, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## లీవ్స్.. క్యారీ ఫార్వర్డ్!

**యాక్సెంచర్ లీవ్ పాలసీలో మార్పు**

న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ యాక్సెంచర్ తన ఉద్యోగుల లీవ్ పాలసీ విధానంలో కీలక మార్పులు చేపట్టింది. సాధారణంగా ప్రతి ఏటా ఆగస్టు 31తో ముగిసే కంపెనీ ఆర్థిక సంవత్సరంలో మిగిలిపోయిన సెలవులు ఆటోమేటిక్‌గా రద్దవుతాయి. అయితే, ఈ ఏడాదికి మాత్రమే ప్రత్యేక మినహాయింపునిస్తూ, వినియోగించుకోని సెలవులను సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే నూతన ఆర్థిక సంవత్సరానికి బదిలీ (క్యారీ ఫార్వర్డ్) చేసుకునే వెసులుబాటును కల్పించింది. ఈ నిర్ణయం వెనుక పటిష్ఠమైన వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. కంపెనీ సీఈఓ జూలీ స్వీట్ ఇటీవల ఉద్యోగులకు పంపిన అంతర్గత మెమోలో, నాలుగో త్రైమాసికంలో విక్రయాలను పెంచి, ఆదాయ వృద్ధిపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. 'మెగా డీల్స్'తో సహా అన్ని విభాగాల్లో విక్రయాలను వేగవంతం చేయాలని, ఇన్వెస్టర్లు కంపెనీపై నమ్మకంతో ఉన్నారని ఆమె పేర్కొన్నారు. ఆగస్టు నెలలో ఉద్యోగులు సెలవులు తీసుకోకుండా పనిపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించేలా ప్రోత్సహించడమే ఈ మార్పు ప్రధాన ఉద్దేశమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం యాక్సెంచర్ కొంత మేర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మే 31తో ముగిసిన త్రైమాసికంలో కొత్త బుకింగ్స్ 2 శాతం మేర తగ్గుముఖం పట్టాయి. నాలుగో త్రైమాసికానికి సంబంధించి కంపెనీ వెల్లడించిన ఆదాయ అంచనాలు కూడా మార్కెట్ విశ్లేషకుల అంచనాలకు దిగువనే నమోదయ్యాయి. దీనికి తోడు, ఈ ఏడాదిలో కంపెనీ షేర్ల విలువ సుమారు 36 శాతం వరకు క్షీణించింది. ఈ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ పనితీరును మెరుగుపరిచేందుకు యాజమాన్యం ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది.

## జియో ప్రైమ్ రూ.300 రీలాంచ్

ముంబై: రిలయన్స్ జియో తన కస్టమర్లకు తీపి కబురు అందించింది. సంస్థ పదేళ్ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, 'జియో ప్రైమ్' మెంబర్‌షిప్ ప్రోగ్రామ్‌ను పునరుద్ధరించింది. ఇందులో భాగంగా రూ. 300 ఒకేసారి చెల్లించి, ఏడాది పాటు టారిఫ్‌లపై ధరల గ్యారెంటీ పొందవచ్చని వెల్లడించింది. ఈ మెంబర్‌షిప్ తీసుకున్న యూజర్లు, తాము ప్రస్తుతం వినియోగిస్తున్న ప్లాన్‌లతోనే 2027 సెప్టెంబర్ 5 వరకు రీఛార్జ్‌లు చేసుకోవచ్చు. భవిష్యత్తులో టారిఫ్‌లు పెరిగినప్పటికీ, ప్రైమ్ సభ్యులకు పాత ధరలే వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. ప్రస్తుత ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ కస్టమర్లతో పాటు, ఇతర నెట్‌వర్క్‌ల నుంచి జియోకు మారే వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఇటీవల ప్రత్యర్థి సంస్థ ఎయిర్‌టెల్ రూ. 299 ప్లాన్‌తో సహా పలు ఇతర ప్లాన్‌లను నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమ అత్యంత ప్రజాదరణ పొందన రూ. 299 (రోజుకు 1.5 జీబీ డేటా, అపరిమిత కాల్స్) ప్లాన్‌ను యథాతథంగా కొనసాగిస్తామని జియో ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో జియో ప్రైమ్ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ధరల గ్యారెంటీతో పాటు, ప్రైమ్ సభ్యులకు రూ. 600 విలువైన క్యాష్‌బ్యాక్ వోచర్లు కూడా లభిస్తాయి. కొత్త జియోహోమ్ లేదా జియోపీసీ కనెక్షన్‌పై రూ. 300, కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల కోసం కొత్త సిమ్ తీసుకుంటే మరో రూ. 300 వోచర్ అందజేస్తారు. వీటితో పాటు కొత్త ఉత్పత్తులు, సేవలకు ముందస్తు యాక్సెస్, ప్రత్యేక కస్టమర్ సపోర్ట్ వంటి అదనపు ప్రయోజనాలు లభిస్తాయి.



# భారత్ ట్యాక్సీలో 8 లక్షల డ్రైవర్లు

**41 లక్షల కస్టమర్లు చేరిక**

**జీరో కమిషన్ విధానంలో డ్రైవర్లకు ప్రయోజనం**

**త్వరలో మరో ఏడు నగరాల్లో సేవలు**

న్యూఢిల్లీ: దేశంలో క్యాబ్ సేవల రంగంలో కొత్త వేదిక వేగంగా విస్తరిస్తోంది. సహకార సంస్థల ఆధారంగా పనిచేస్తున్న 'భారత్ ట్యాక్సీ'కి భారీ స్పందన లభిస్తోంది. జులై 25 నాటికి ఈ ప్లాట్‌ఫామ్‌లో దాదాపు 8 లక్షల మంది డ్రైవర్లు చేరారు. కస్టమర్ల సంఖ్య 41 లక్షలకు చేరింది. 2029 నాటికి దేశవ్యాప్తంగా సేవలు అందించడమే లక్ష్యంగా భారత్ ట్యాక్సీ ముందుకు సాగుతోంది. మల్టీ-స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్-2002 కింద భారత్ ట్యాక్సీ ఏర్పాటైంది. నాబార్డ్, ఇఫ్కో, అమూల్, నాఫెడ్, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహా ఎనిమిది జాతీయ సహకార సంస్థలు దీన్ని ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్, ముంబయి, లఖ్‌నవూ, చండీగఢ్, జైపూర్, కాన్పూర్, పుణేలో సేవలు అందిస్తోంది. త్వరలో మరిన్ని నగరాలకు భారత్ ట్యాక్సీ విస్తరించనుంది. రాంచీ, పాట్నా, గువాహటి, భోపాల్, కోల్‌కతా, ఇండోర్, నాగ్‌పూర్‌లో సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దశలవారీగా దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత జీరో కమిషన్ విధానం. డ్రైవర్లను 'సారథులు'గా పిలుస్తున్నారు. ప్రయాణికుల నుంచి వచ్చిన చార్జీలో ప్లాట్‌ఫామ్‌కు కమిషన్ చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో డ్రైవర్లు తమ ఆదాయాన్ని పూర్తిగా పొందే అవకాశం ఉంటుంది. సారథులు సహకార సంస్థలో వాటాలు కొనుగోలు చేసి సభ్య యజమానులుగా మారొచ్చు. సంస్థ నిర్వహణలోనూ వారికి ప్రాతినిధ్యం ఉంటుంది. బైక్ ట్యాక్సీలు, ఆటోలు, ఎకానమీ క్యాబ్‌లు, ప్రీమియం సెడాన్లు, ఎస్‌యూవీలు, రెంటల్స్, అవుట్‌స్టేషన్ ప్రయాణాలు, ముందస్తు బుకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ధరల్లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ తెలిపింది. సర్జ్ ప్రైసింగ్, అదనపు ప్లాట్‌ఫామ్ ఛార్జీలు ఉండవని పేర్కొంది. మహిళల కోసం 'సారథి దీదీ' సేవను కూడా తీసుకొచ్చింది. దీని ద్వారా మహిళా ప్రయాణికులు మహిళా డ్రైవర్లను ఎంచుకోవచ్చు. మహిళలు డ్రైవింగ్ రంగంలోకి రావడానికి 'బైక్ దీదీ' కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. డ్రైవర్లను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయడంతో సామాజిక భద్రతా ప్రయోజనాలు పొందే అవకాశం కల్పిస్తున్నారు. ప్రమాద, ఆరోగ్య బీమా సదుపాయాలను కూడా భాగస్వామ్య సంస్థల ద్వారా అందిస్తున్నారు.

# ఎన్డీయేలో చేరబోం

**ప్రతిపక్షంలోనే కొనసాగుతాం**

**శరద్ పవార్ స్పష్టీకరణ**



ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో కొంతకాలంగా సాగుతున్న ఊహాగానాలకు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ తెరదించారు. తమ పార్టీ ఎన్డీయేలో చేరబోదని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలోనే కొనసాగుతామని పార్టీ నేతలకు తేల్చి చెప్పారు. ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. వారాంతంలో జరిగిన రెండు రోజుల పార్టీ సమావేశంలో శరద్ పవార్ ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలో చేరతారన్న ప్రచారాన్ని పట్టించుకోవద్దని పార్టీ శ్రేణులకు సూచించారు. మహారాష్ట్రతో పాటు జాతీయ స్థాయిలోనూ సమర్థమైన ప్రతిపక్షంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అజిత్ పవార్ వర్గంతో మళ్లీ కలుస్తారన్న ప్రచారానికి కూడా తాజా నిర్ణయంతో తెరపడినట్లయింది. దీంతో మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడీ కూటమికి ఊరట లభించింది. శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), కాంగ్రెస్‌తో కలిసి ప్రతిపక్ష పోరాటాన్ని కొనసాగించేందుకు మార్గం సుగమమైంది. ఇటీవల శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. సుప్రియా సూలే, బజరంగ్ సోనావణే నేతృత్వంలో ఎనిమిది మంది లోక్‌సభ సభ్యులు ఈ భేటీలో పాల్గొన్నారు. శరద్ పవార్ కూడా ప్రభుత్వ పెద్దలను కలవడంతో పార్టీ ఎన్డీయే వైపు వెళుతుందన్న ప్రచారం ఊపందుకుంది. అయితే నియోజకవర్గాల అభివృద్ధి, రైతుల సమస్యలు, ప్రజా ప్రయోజనాల కోసమే ఇలాంటి భేటీలు జరుగుతున్నాయని ఎన్సీపీ (ఎస్పీ) స్పష్టం చేసింది. వీటికి పార్టీ రాజకీయ వైఖరితో సంబంధం లేదని తెలిపింది. పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు శశికాంత్ షిండే కూడా తమ భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు, వర్క్‌షాప్‌లు, సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానిక సమస్యలపై ప్రజా ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఖాళీగా ఉన్న పార్టీ పదవులను భర్తీ చేసి క్షేత్రస్థాయిలో సంస్థను బలోపేతం చేయాలని జిల్లా నేతలకు ఆదేశాలు ఇచ్చారు. విదర్భ, పశ్చిమ మహారాష్ట్ర, ఉత్తర మహారాష్ట్ర, మరాఠ్వాడాలో ఇప్పటికే పార్టీ సమీక్ష సమావేశాలు పూర్తయ్యాయి. తదుపరి కొంకణ్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. రానున్న స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు.

# 4 నెలల్లో 22 మందికి మరణశిక్ష


**యూపీలో జడ్జి సంచలన తీర్పులు**

ముజఫర్‌నగర్: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌కు చెందిన అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కేవలం నాలుగు నెలల కాలంలోనే 10 వేర్వేరు కేసుల్లో 22 మందికి మరణశిక్ష విధించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. ఈ వరుస తీర్పుల నేపథ్యంలో దేశంలో మరణశిక్షల అమలుపై మరోసారి విస్తృత చర్చ ప్రారంభమైంది. ప్రభుత్వ న్యాయవాది వెల్లడించిన వివరాల ప్రకారం, జడ్జి రవికుమార్ దివాకర్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో ఈ కీలక తీర్పులను వెలువరించారు. న్యాయవాది సమీర్ సఫీ హత్య కేసు, హోంగార్డు హత్య, హైవే దోపిడీ, ఆర్థిక లాభం కోసం కిడ్నాప్ చేసి హత్య చేయడం వంటి అత్యంత క్రూరమైన నేరాల్లో నిందితులకు ఈ కఠిన శిక్షలు ఖరారు చేశారు. ఇందులో భాగంగా ఏప్రిల్‌లో ఏడుగురికి, మే నెలలో ఒకరికి, జూన్‌లో ఇద్దరికి, జూలైలో ఏడుగురికి, ఆగస్టు 13 నాటికి మరో ఐదుగురికి మరణశిక్ష విధించారు. ఇటీవల ఆగస్టు 12న, 1999 నాటి కిడ్నాప్, హత్య కేసులో షానవాజ్‌కు, ఆగస్టు 13న షామ్లీ జిల్లాలో జరిగిన పవన్ కుమార్ హత్య కేసులో నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ఆయన తీర్పునిచ్చారు. జడ్జి దివాకర్ గతంలో బరేలీలో పనిచేస్తున్న సమయంలోనూ 13 మందికి మరణశిక్ష విధించిన చరిత్ర ఉంది. దీంతో ఆయన ఇప్పటివరకు తన పదవీ కాలంలో మొత్తం 35 మందికి మరణశిక్ష విధించినట్లయింది. 2022లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో వీడియోగ్రాఫిక్ సర్వేకు ఆదేశాలు జారీ చేసి జడ్జి రవికుమార్ దివాకర్ దేశవ్యాప్త గుర్తింపు పొందారు. అయితే, సెషన్స్ కోర్టు విధించిన మరణశిక్షలు అమలు కావాలంటే నిబంధనల ప్రకారం హైకోర్టు వాటిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అలాగే, ఈ తీర్పులను సవాలు చేస్తూ నిందితులకు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునే చట్టపరమైన అవకాశం కూడా ఉంటుంది.

## 50 మందిపై ఎన్టీఏ వేటు

### కీలక స్థానాల్లో కొత్త నియామకాలు


న్యూఢిల్లీ: పరీక్ష లీకేజీ నేపథ్యంలో 50 మందికి పైగా సిబ్బందిని తొలగించిన జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ), కీలకమైన నాయకత్వ స్థానాల్లో నిపుణులను నియమిస్తోంది. ఇటీవల నీట్-యూజీ 2026 పేపర్ లీక్ ఆరోపణలు, యూజీసీ-నెట్ పరీక్షల్లో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్‌తో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఐఎస్ఓ) వంటి 10 కీలకమైన పదవుల భర్తీకి నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించింది. సైబర్ సెక్యూరిటీ, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన వంటి విభాగాల్లో ప్రైవేట్ రంగ నిపుణులను కూడా నియమించుకుంటున్నట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. పరీక్షల నిర్వహణలో నిర్దేశిత నిబంధనలను అత్యంత కఠినంగా పాటించాలని కేంద్రమంత్రి అధికారులను ఆదేశించారు. రహస్య కార్యకలాపాల వ్యవస్థను, ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్‌లు, ఎయిర్-గ్యాప్డ్ సిస్టమ్స్ వంటి భద్రతా ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తిగా ఆధునికీకరించాలని సూచించారు. అన్ని పరీక్షా ప్రక్రియలపై పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహించి, చేపట్టిన దిద్దుబాటు చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఎన్టీఏను ఆదేశించారు.




## దిమాగీ నక్సల్ పార్టీ


### ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన 'దిమాగీ నక్సల్' పదం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇదే పేరుతో ఓ కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి వచ్చింది. ఖాతా ప్రారంభించిన 24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు చేరడం ఆసక్తికరంగా మారింది. 'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో ఉన్న ఈ ఖాతాలో 62 పోస్టులు ఉన్నాయి. దాదాపు 35 ఖాతాలను ఫాలో అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లోని వివరాల ప్రకారం ఈ నెలలోనే ఖాతా తెరిచారు. ఇప్పటివరకు ఒకసారి యూజర్ నేమ్‌ను మార్చినట్లు సమాచారం ఉంది. అయితే ఈ ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్' అనే పదాన్ని ఉపయోగించారు. మావోయిస్టులపై పోరులో సాధించిన విజయాలను ప్రస్తావించిన ఆయన.. అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని అణిచివేయగలిగామని చెప్పారు. అయితే సాయుధ నక్సల్స్ తగ్గిపోయినా.. 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారని వ్యాఖ్యానించారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యల తర్వాత అదే పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి రావడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తి రేపుతోంది. అయితే ఖాతా వెనుక ఎవరున్నారు? దాని ఉద్దేశం ఏంటి? అనే విషయాలు మాత్రం స్పష్టంగా తెలియలేదు.



## ఎమ్మెల్యేగా పీకే ప్రమాణం

పాట్నా: జన సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో తన ప్రస్థానాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈరోజు ఆయన బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గ నూతన శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. బీహార్ అసెంబ్లీ స్పీకర్ ప్రేమ్ కుమార్ తన ఛాంబర్‌లో ప్రశాంత్ కిషోర్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి జన సురాజ్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరగడం లేదు. వర్షాకాల సమావేశాలు ఇప్పటికే ముగియగా, శీతాకాల సమావేశాలకు ఇంకా సమయం ఉంది. ఈ నేపథ్యంలో స్పీకర్ తన ఛాంబర్‌లోనే నూతన సభ్యుడితో ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారంతో ప్రశాంత్ కిషోర్ శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు అధికారికంగా అర్హత సాధించారు. జులై 30న జరిగిన బంకిపూర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్.. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై 19,246 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికలో ఆర్జేడీ అభ్యర్థి మూడో స్థానానికి పరిమితమై డిపాజిట్ కోల్పోయిన విషయం తెలిసిందే. గెలిచిన అనంతరం పీకే, రాబోయే రెండు మూడు నెలల్లోనే తన నియోజకవర్గంలో స్పష్టమైన మార్పు చూపిస్తానని హామీ ఇచ్చారు. 10,000 మంది యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి, పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో విద్య, రేషన్ కార్డుల వ్యవస్థ మెరుగుదల, 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ. 1,100 పింఛను వంటి కీలక హామీలను ప్రకటించారు. కేవలం బంకిపూర్‌కే పరిమితం కాకుండా త్వరలో జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికలపైనా జన సురాజ్ పార్టీ దృష్టి సారిస్తోంది. పార్టీ విస్తరణలో భాగంగా పీకే త్వరలో మరోసారి రాష్ట్రవ్యాప్త పర్యటనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



## స్కాంలను అడ్డుకోవాలి

**లేకపోతే నేనే ఆందోళన చేస్తా**

**కేంద్రానికి బాబా రాందేవ్ హెచ్చరిక**

న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న అవినీతి, ఆర్థిక నేరాలు, వివిధ రంగాల్లో వెలుగుచూస్తున్న స్కామ్‌లపై ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలో జరుగుతున్న అక్రమాలు, కుంభకోణాలను అరికట్టడానికి ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే, తాను మళ్లీ నల్లధనం, అవినీతికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాల్సి వస్తుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. గతంలో అవినీతికి వ్యతిరేకంగా సాగించిన పోరాటాలను గుర్తుచేసిన ఆయన, దేశంలో పారదర్శకతను పెంచడం, సామాన్యుల సొమ్మును దోచుకునే వారిపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను సరిదిద్దాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున గళం విప్పడానికి తాను ఏమాత్రం వెనుకాడబోనని తేల్చి చెప్పారు. పతంజలి సంస్థ ఉత్పత్తులకు సంబంధించి ఇటీవల న్యాయస్థానాల్లో ఎదురైన వివాదాలు, వ్యాపార ప్రకటనలపై వచ్చిన విమర్శల నేపథ్యంలో, బాబా రామ్‌దేవ్ నేరుగా కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వయ్యారి చిత్రం



నటాషా భరద్వాజ్

# ఇండియాలో 'స్పైడర్ మ్యాన్' రూ.500 కోట్లు

ఈవార్తలు – వినోదవాణి: హాలీవుడ్ స్టార్స్ టామ్ హాలండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ హీరో చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. జులై 31న విడుదలైన ఈ సినిమా, అంచనాలకు మించి భారీ విజయాన్ని నమోదు చేస్తూ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 19,120 కోట్లు) మార్క్‌ను దాటింది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) నుంచి 38వ చిత్రంగా వచ్చిన ఈ సినిమా, కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది. భారతీయ బాక్సాఫీస్ వద్ద కూడా ఈ చిత్రం ప్రభంజనం సృష్టించింది. ఇండియాలో రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ఇక్కడ అత్యధిక వసూళ్లు రాబట్టిన హాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. భారీ విజయాలు సాధించిన క్రిస్టోఫర్ నోలన్ చిత్రం 'ది ఒడిస్సీ', 'అబ్సెషన్' రికార్డులను ఇది బద్దలు కొట్టింది.



# 'కెప్టెన్ ఇండియా'లో పార్వతి

ఈవార్తలు – వినోదవాణి: బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ థ్రిల్లర్ మూవీ 'కెప్టెన్ ఇండియా'. ఈ సినిమాతో టాలెంటెడ్ డైరెక్టర్ షిమిత్ అమిన్ సుదీర్ఘ కాలం తర్వాత మళ్లీ దర్శకత్వం వహిస్తున్నారు. 'అబ్ తక్ ఛప్పన్', 'చక్ దే! ఇండియా', 'రాకెట్ సింగ్' వంటి క్లాసిక్ హిట్స్ అందించిన ఆయన, దాదాపు 15 ఏళ్ల గ్యాప్ తర్వాత ఈ ప్రాజెక్ట్‌తో గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇస్తుండటంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. హర్మన్ బవేజాకు చెందిన బవేజా స్టూడియోస్, భూషణ్ కుమార్ టెన్సన్ టీ-సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'కెప్టెన్ ఇండియా' చిత్రం, ఒక యుద్ధ ప్రాంతం నుంచి భారత్ చేపట్టిన అత్యంత పెద్ద మానవీయ రెస్క్యూ ఆపరేషన్ ఆధారంగా తెరకెక్కుతోంది. ఈ ఆపరేషన్‌ను ముందుండి నడిపించి, అసామాన్యమైన ధైర్యసాహసాలను ప్రదర్శించిన ఒక పైలట్ పాత్రలో కార్తీక్ ఆర్యన్ కనిపించనున్నారు. ప్రస్తుతం ఆయన కబీర్ ఖాన్ దర్శకత్వంలో రాబోతున్న స్పోర్ట్స్ డ్రామా షూటింగ్‌లో పాల్గొంటుండగా, త్వరలోనే అది పూర్తి చేసుకుని 'కెప్టెన్ ఇండియా' సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు.





# ఏఏ23.. నవంబర్‌లో స్టార్ట్

ఈవార్తలు – వినోదవాణి: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. ఇప్పటికే 'ఏఏ23' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వెలువడింది. ప్రస్తుతం అల్లు అర్జున్, అట్లీ దర్శకత్వంలో 'రాకా' అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ మూవీ అత్యంత భారీ గ్రాఫిక్స్‌తో తెరకెక్కుతోంది. అయితే ఈ సినిమా విడుదలైన తర్వాతే అల్లు అర్జున్–లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లోని చిత్రం ప్రారంభమవుతుందనే ఊహాగానాలు గతంలో వినిపించాయి. దీంతో బన్నీ అభిమానులు కాస్త నిరాశకు గురయ్యారు. అయితే ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. ఈ నవంబర్ నుంచే 'ఏఏ23' సినిమా అధికారికంగా లాంచ్ కానున్నట్లు, ఆ తర్వాత రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. దీంతో అల్లు అర్జున్ ఒకవైపు 'రాకా', మరోవైపు లోకేష్ కనగరాజ్ సినిమాల షూటింగ్స్‌లో ఏకకాలంలో పాల్గొనబోతున్నట్లు తెలుస్తోంది. ఇలా రెండు సినిమాల షూటింగ్స్‌లో ఒకేసారి పాల్గొంటుండటంతో ఈ రెండు చిత్రాలు కూడా తక్కువ గ్యాప్‌లోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తమ అభిమాన నటుడు ఒకేసారి రెండు సినిమాల్లో నటిస్తూ, తక్కువ గ్యాప్‌లోనే సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నాడని తెలియడంతో బన్నీ అభిమానులు తెగ ఆనందపడుతున్నట్లు తెలుస్తోంది.

# అనసూయపై పోలీసులకు ఫిర్యాదు

ఈవార్తలు – వినోదవాణి: టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయపై పోలీసులకు ఫిర్యాదు అందింది. రీసెంట్ గా అనసూయ తన ఇన్ స్టాగ్రామ్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో.. జై శ్రీరామ్ పేరుతో కొందరు దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. సనాతన ధర్మం ముసుగులో పెద్ద దొంగలు కూడా ఉన్నారని వ్యాఖ్యానించారు. దీనిపై విమర్శలు రావడంతో తన మాటలను వక్రీకరిస్తున్నారని, తాను అందరు హిందువుల గురించి మాట్లాడలేదని అనసూయ మరో వీడియో చేశారు. కేవలం మతం పేరుతో అరాచకాలు చేస్తున్న కొందరి గురించే చెప్పానని అన్నారు. తాను రాముడి భక్తురాలిని అని, తన కుమారుడికి హనుమంతుడి పేరు పెట్టుకున్నానని చెప్పారు. అయితే తాజాగా ఇదే వివాదానికి సంబంధించి బీజేపీ నాయకులు హైదరాబాద్ బోరబండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.



# అందం.. అదృష్టం.. రితికా నాయక్

ఈవార్తలు – వినోదవాణి: బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుందునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది.






# నవంబర్ 10న అనిరుధ్-కావ్య మారన్ పెళ్లి?

ఈవార్తలు – వినోదవాణి: సన్ రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవి చందర్ పెళ్లి డేట్ ఫిక్స్ అయినట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. నవంబర్ 10వ తేదీన గ్రీస్ వేదికగా వీళ్ళ వివాహం జరగనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇరు కుటుంబాలు పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. డేట్ ఫైనల్ చేసినట్లు టాక్ నడుస్తోంది. కాగా ఈ ఇద్దరి రిలేషన్ ను అనిరుధ్ మావయ్య, ప్రముఖ నటుడు మహేంద్రన్ ఇటీవల ఖరారు చేశారు. అయితే ఈ విషయంపై ఇరు కుటుంబాల నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ఇంతలోనే పెళ్లి డేట్ ఫిక్స్ అయినట్లు సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారు. మరి దీనిపై క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.


# అదే నా డ్రీమ్: అనన్య

ఈవార్తలు – వినోదవాణి: బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ అనన్య పాండే అతి తక్కువ సమయంలోనే వైవిధ్యమైన పాత్రలో నటించి ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. ఇటీవల 'చాంద్ మేరా దిల్' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. అయితే ఈ మూవీ బాక్సాఫీసు వద్ద ఆశించినంత స్థాయిలో రాణించకపోవడంతో కొంత గ్యాప్ తీసుకున్నారు. ఈనేపథ్యంలోనే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన హాట్ ఫొటోలు షేర్ చేస్తున్న అనన్య పాండే తాజాగా ఒక ఇంటర్వ్యూలో భాగంగా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సోషల్ మీడియాలో వ్యాపించే నెగెటివిటీ, ట్రోలింగ్‌తో సతమతమయ్యే వారికి ఆమె ఒక మంచి సలహా ఇచ్చారు. ఆన్‌లైన్ నెగెటివిటీని చూసి భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. మనపై నెగెటివిటీ లేదా ట్రోలింగ్ వచ్చినప్పుడు కాస్త ప్రశాంతంగా వెనక్కి తగ్గి ఆలోచిస్తే, ఈ పరిస్థితి కేవలం మన ఒక్కరికే కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరికీ ఎదురవుతోందని అర్థమవుతుందని అన్నారు. సమాజంలో ఎంతో విజయవంతంగా, అత్యంత ఆత్మవిశ్వాసంతో కనిపించే వ్యక్తులు కూడా ఇలాంటి ఆన్‌లైన్ విమర్శలను ఎదుర్కొంటున్నారని గ్రహిస్తే, దానికి ఉ ండే శక్తి, భయం పూర్తిగా తగ్గిపోతాయని అనన్య వివరించారు. ఇక చిత్రపరిశ్రమలో తాను ఇప్పటివరకు కలిసి పనిచేయని కొందరు దిగ్గజ దర్శకులతో పనిచేయాలని ఉందని తన కోరికను బయటపెట్టారు. బాలీవుడ్ ప్రముఖ దర్శకులు కరణ్ జోహార్, జోయా అక్తర్, సంజయ్ లీల భన్సాలీలతో పనిచేయడం తన డ్రీమ్ లిస్ట్‌లో ఉందని వెల్లడించారు. ఈ ముగ్గురు అగ్ర దర్శకుల దర్శకత్వంలో నటించే అవకాశం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు అనన్య స్పష్టం చేశారు.



# నాంపల్లి కోర్టులో వర్చువల్‌గా హాజరైన అల్లు అర్జున్

ఈవార్తలు – వినోదవాణి: హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఉన్న సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసు విచారణ సోమవారం నాంపల్లి కోర్టులో జరిగింది. ఈ కేసుకు సంబంధించి ప్రముఖ నటుడు అల్లు అర్జున్ నాంపల్లి కోర్టు ముందు వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) ద్వారా హాజరయ్యారు. ప్రస్తుతం ఆయన 'రాకా' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉ ండటం, ముంబైలో మకాం వేసి ఆ షెడ్యూల్‌లో పాల్గొనాల్సిన పరిస్థితి ఉండటంతో.. కోర్టుకు నేరుగా కాకుండా వర్చువల్‌గా విచారణకు హాజరై తన వాదనలు వినిపించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయస్థానం, వాటిని నమోదు చేసుకుని తదుపరి విచారణను సెప్టెంబర్ 1వ తేదీకి వాయిదా వేసింది.





# ఫుట్‌బాల్‌కు రొనాల్డో గుడ్‌బై?

ఈవార్తలు-క్రీడావాణి: ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో తన అభిమానులకు ఒకేసారి రెండు పెద్ద వార్తలు చెప్పాడు. తన సుదీర్ఘకాల భాగస్వామి జార్జినా రోడ్రిగ్జ్‌ను రహస్యంగా వివాహం చేసుకున్నట్లు ప్రకటించడంతో పాటు, తన రిటైర్మెంట్‌పై కూడా కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రముఖ ఫ్యాషన్ మ్యాగజైన్ 'వోగ్' వీరి వివాహ చిత్రాలను అధికారికంగా విడుదల చేయడంతో ఈ విషయం బయటకు వచ్చింది. పోర్చుగల్‌లోని కాస్కైస్‌లో ఉన్న తమ నివాసంలో అత్యంత నిరాడంబరంగా ఈ వివాహ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి వారి ఐదుగురు పిల్లలతో పాటు కేవలం నలుగురు సాక్షులు మాత్రమే హాజరయ్యారు. సరిగ్గా పదేళ్ల క్రితం 2016లో మాడ్రిడ్‌లోని గుస్సీ స్టోర్‌లో తొలిసారి కలుసుకున్న ఆగస్టు 11వ తేదీనే వీరు వివాహ బంధంతో ఒక్కటవ్వడం విశేషం. ఈ సందర్భంగా జార్జినా 'వోగ్' మ్యాగజైన్‌తో మాట్లాడుతూ "చిన్నప్పుడు రాకుమారిలా గుర్రపు బగ్గీలో, వజ్రాల కిరీటంతో వైభవంగా పెళ్లి చేసుకోవాలని కలలు కన్నాను. కానీ రోజూ విలాసవంతమైన జీవితాన్ని చూసే మాకు, ఇంట్లో పిల్లలు, భాగస్వామితో గడిపే ప్రశాంతమైన, వ్యక్తిగత సమయమే చాలా అరుదైనది. అందుకే ఇంట్లోనే పెళ్లి చేసుకున్నాం" అని తన ఆనందాన్ని పంచుకుంది. పెళ్లి వార్తతో పాటే, తన కెరీర్‌కు సంబంధించి 41 ఏళ్ల రొనాల్డో ఒక కీలక ప్రకటన చేశాడు. రాబోయే 2026-27 సీజన్ బహుశా తన చివరి సీజన్ కావచ్చని చెప్పాడు. "ఇది ఫుట్‌బాల్ మైదానంలో నా ఆఖరి ఏడాది కావచ్చు. 25 ఏళ్లుగా ఆట కోసం ఎన్నో త్యాగాలు చేశాను. ఒక గొప్ప రికార్డును, వారసత్వాన్ని మిగిల్చి ఆట నుంచి నిష్క్రమించాలని ఉంది. రిటైర్మెంట్ తర్వాత ప్రయాణాలు చేయడం, కుటుంబంతో గడపడం వంటి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి" అని పోర్చుగల్ కెప్టెన్, అల్ నాసర్ క్లబ్ స్టార్ అయిన రొనాల్డో వివరించాడు.

# వరల్డ్ నం.1కు ఆయుశ్ శెట్టి షాక్!

ఈవార్తలు-క్రీడావాణి: ఢిల్లీలో సోమవారం మొదలైన బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మొదటి రోజే పెను సంచలనం చోటుచేసుకుంది. భారత యువ ప్లేయర్ ఆయుశ్ శెట్టి అద్భుతం చేశాడు. సోమవారం జరిగిన మెన్స్ సింగిల్స్ తొలి రౌండ్‌లో ఏకంగా వరల్డ్ నం.1, డిఫెండింగ్ చాంపియన్ షి యు కి(చైనా)కు షాకిచ్చాడు. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఆయుశ్ 21-14, 13-21, 21-19 తేడాతో విజయం సాధించాడు.



ఆయుశ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనడం ఇదే తొలిసారి. అంతేకాకుండా ప్రత్యర్థేమో వరల్డ్ నం.1 ప్లేయర్. ఆయుశ్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమిస్తాడని చాలా మందే భావించి ఉంటారు. కానీ, అతను సంచలన ప్రదర్శన చేశాడు. షి యు కితో గంటా 13 నిమిషాలపాటు పోరాడాడు. ప్రత్యర్థి వరల్డ్ నం.1 అని ఆయుశ్ ఏమాత్రం బెదరలేదు. వెనకడుగు వేయలేదు. తొలి గేమును అలవోకగా నెగ్గి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నాడు. రెండో గేము ఆరంభంలో కూడా కూడా ప్రత్యర్థికి గట్టి సవాల్ విసిరాడు. ఒకానొక సమయంలో 8-7తో లీడ్‌లో ఉన్నాడు కూడా. కానీ షి యు కి తన అనుభవమంతా ప్రదర్శిస్తూ ఆయుశ్‌కు కళ్లెం వేశాడు. రెండో గేము నెగ్గి స్కోరును 1-1తో సమం చేశాడు. ఇక నిర్ణయాత్మక మూడో గేములో ఆయుశ్ మొదట్లో హవా ప్రదర్శించాడు. 16-5తో భారీ లీడ్‌లో నిలిచాడు. విజయం ఖాయమే అనుకున్న వేళ ప్రత్యర్థి బలంగా పుంజుకున్నాడు. వరుసగా పాయింట్లు గెలుస్తూ ఆయుశ్ ఆధిక్యాన్ని తగ్గిస్తూ వచ్చాడు. చివరికి 20-19తో ఇద్దరు నిలవడంతో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. కానీ, విజయం ఆయుశ్‌నే వరించింది. మరో పాయింట్ ఖాతాలో వేసుకుని రెండో రౌండ్‌లో అడుగుపెట్టాడు.




# లంక విలవిల

## సుతార్, జడేజా స్పిన్ దెబ్బకు కుదేల్.. భారత్‌కు 178 పరుగుల ఆధిక్యం

**ఈవార్తలు-క్రీడావాణి: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు పట్టు బిగించింది. యువ స్పిన్నర్ మానవ్ సుతార్, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా స్పిన్ మాయాజాలంతో మూడో రోజు శ్రీలంకను తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో భారత్‌కు 178 పరుగుల కీలక ఆధిక్యం లభించింది.**

సోనల్ దినూష (100) అద్భుతమైన సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా జట్టును ఆదుకోలేకపోయాడు. వర్షం కారణంగా సోమవారం ఆటను ముందుగానే నిలిపివేశారు. అంతకుముందు, ఉదయం 462 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను ముగించిన భారత్, బౌలింగ్‌లోనూ ఆది నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది.

మహమ్మద్ సిరాజ్ తాను వేసిన రెండో బంతికే ఓపెనర్ మదుష్కను డకౌట్ చేశాడు. ఆ తర్వాత స్పిన్నర్లు రంగంలోకి దిగారు. ఈ పర్యటనపై భారీ అంచనాలతో వచ్చిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్, తాను వేసిన తొలి బంతికే దినేశ్ చండీమల్‌ను ఔట్ చేసి సత్తా చాటాడు. పదునైన బంతులతో టర్న్, బౌన్స్ రాబట్టిన సుతార్ మొత్తం 4 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు రవీంద్ర జడేజా 3 వికెట్లతో రాణించి, టెస్టు క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. కుల్దీప్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలో వికెట్ పంచుకున్నారు. ఒక దశలో 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి శ్రీలంక ఫాలోఆన్ ముంగిట నిలిచింది. ఈ క్లిష్ట సమయంలో సోనల్ దినూష, నిరోషన్ డిక్వెల్లా (80) అద్భుతంగా పోరాడారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. దాదాపు మూడేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన డిక్వెల్లా అర్ధశతకంతో ఆకట్టుకోగా, దినూష తన అరంగేట్ర సెంచరీతో మెరిశాడు. అయితే, 80 పరుగులు చేసిన డిక్వెల్లాను ప్రసిద్ధ్ కృష్ణ ఔట్ చేయడంతో ఈ భాగస్వామ్యం విడిపోయింది. ఆ తర్వాత లంక ఇన్నింగ్స్ మళ్లీ పేకమేడలా కూలింది. చివరి 5 వికెట్లను కేవలం 50 పరుగుల తేడాతో కోల్పోయింది. దినూష శతకం పూర్తి చేసుకున్న వెంటనే జడేజా అతడిని ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది.

# ఇంగ్లండ్ చేతిలో భారత్ ఓటమి



ఈవార్తలు-క్రీడావాణి: పురుషుల హాకీ ప్రపంచ కప్-2026లో భారత్‌కు తొలి ఓటమి ఎదురైంది. సోమవారం ఆమ్‌స్టల్‌వీన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన పూల్-డి గేమ్‌లో 2-4 తేడాతో టీమిండియా ఓటమి పాలైంది. కాగా ఈ మ్యాచ్ తొలి అర్ధభాగంలో భారత్ ఆధిపత్యం చెలాయించింది. నిక్ బందురాక్ గోల్‌తో ఇంగ్లండ్ బోణీ కొట్టినప్పటికీ.. తర్వాత భారత్ అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చింది. భారత కెప్టెన్ హర్మాన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడం, ఆపై దిల్ ప్రతీ సింగ్ ఫీల్డ్ గోల్ చేయడంతో హాఫ్‌టైమ్ సమయానికి భారత్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. కానీ సెకెండ్ హాఫ్ కథ తారుమారైంది. స్టువర్ట్ రష్‌మీర్, హెన్రీ క్రాఫ్ట్‌లు వరుస గోల్స్‌తో ఇంగ్లండ్‌ను 3-2 ఆధిక్యంలోకి తీసుకెళ్లారు. చివరి నిమిషాల్లో నిక్ బందురాక్ మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్ చేసి ఇంగ్లండ్ విజయాన్ని (4-2) ఖాయం చేశాడు. ఇక భారత జట్టు తమ ఆఖరి పూల్ మ్యాచ్‌లో ఆగస్టు 19న పాకిస్తాన్‌తో తలపడనుంది. క్వార్టర్స్ రేసులో ముందంజలో ఉండాలంటే పాక్‌పై భారత్ తప్పక భారీ తేడాతో గెలవాల్సి ఉంటుంది.



# పంత్ సోయితో ఆడాలి: కైఫ్

ఈవార్తలు-క్రీడావాణి: టీమిండియా టెస్ట్ వికెట్ కీపర్ రిషభ్ పంత్‌పై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. కామన్‌సెన్స్‌తో బ్యాటింగ్ చేయాలని చురకలంటించాడు. శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో రిషభ్ పంత్ చెత్త షాట్‌తో మూల్యం చెల్లించుకున్నాడు. 62 బంతుల్లో 39 పరుగులే చేసి వెనుదిరిగాడు. అంతకుముందు కూడా ఇలాంటి ప్రయత్నాలే చేసి విఫలమైనా.. వెనక్కి తగ్గకుండా పేలవ షాట్ ఆడి పెవిలియన్ చేరాడు. ఈ క్రమంలో అతని ఆటతీరును కైఫ్ తప్పుబట్టాడు. దూకుడుగా ఆడుదామనే ఉద్దేశం మంచిదే అయినా.. సమయం-సందర్భం చూడాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. 'రిషభ్ పంత్ ఔటైన విధానంపై నేనెలాంటి ఫిర్యాదు చేయడం లేదు. ఎందుకంటే అతను మాత్రమే ఇలా ఆడగలడు.

# ఆసీస్‌కు 42 లక్షల జరిమానా

ఈవార్తలు-క్రీడావాణి: పసికూన బంగ్లాదేశ్ చేతిలో చిత్తుగా ఓడిన ఆస్ట్రేలియాకు మరో షాక్ తగలనుంది. స్లో ఓవర్‌రేట్ కారణంగా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)2027 పాయింట్స్ టేబుల్‌లో పాయింట్స్ కోతతో పాటు రూ.42 లక్షల(44 వేల డాలర్లు) జరిమానా ఎదుర్కొనే అవకాశం ఉంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా డార్విన్ వేదికగా ఆదివారం ముగిసిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించిన బంగ్లాదేశ్ 9 వికెట్ల తేడాతో ఆసీస్‌ను ఓడించింది. టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఆసీస్‌పై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి టెస్ట్ విజయం. అది కూడా వారి సొంతగడ్డపై ఓడించి బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. అయితే ఈ మ్యాచ్‌లో ఆసీస్ స్లో ఓవర్ రేట్‌కు కారణమైంది. మూడో రోజు ఆటలో నిర్ణీత సమయం కన్నా 4 ఓవర్లు తక్కువగా వేసింది. దీంతో ఐసీసీ రూల్స్ ప్రకారం ఒక్కో ఓవర్‌కు ఒక్కో పాయింట్ చొప్పున నాలుగు పాయింట్స్ కోత పడనుండగా.. ఓవర్‌కు ఐదు శాతం చొప్పున మ్యాచ్ ఫీజులో కోత విధించనున్నారు. ఆస్ట్రేలియా ఆటగాళ్లకు ఒక్క టెస్ట్ మ్యాచ్‌కు రూ. 19 లక్షల మ్యాచ్ ఫీజు దక్కనుంది. ఈ లెక్కన ఆసీస్ తుది జట్టు మొత్తానికి రూ. 42 లక్షల జరిమాన పడనుంది. ఈ లెక్కన ఒక్కో ఆటగాడు 3 లక్షల 82 వేలు నష్టపోనున్నాడు. స్లో ఓవర్ రేట్ చర్యలపై ఐసీసీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



# 'సర్' రికార్డుల మోత

### టెస్టుల్లో 350 వికెట్లు తీసిన ఆల్‌రౌండర్

### తొలి భారత లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా జడేజా

ఈవార్తలు-క్రీడావాణి: టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా తన సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని అందుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో 350 వికెట్లు పడగొట్టిన తొలి భారత లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఈ ఘనత సాధించాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు దూరంగా ఉన్న జడేజా, ఈ మ్యాచ్‌తో పునరాగమనం చేసి వెంటనే తనదైన ముద్ర వేశాడు. సోమవారం, మ్యాచ్ మూడో రోజు ఆటలో భాగంగా శ్రీలంక ఆల్ రౌండర్ కేశర నువంతను ఔట్ చేయడం ద్వారా జడేజా ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. జడేజా వేసిన బంతిని నువంత కవర్స్ వైపు బలంగా కొట్టగా, అది సిల్లీ పాయింట్‌లో ఉన్న యశస్వి జైస్వాల్ తొడకు తగిలి గాల్లోకి లేచింది. సమీపంలోనే ఉన్న శుభ్‌మన్ గిల్ చాకచక్యంగా క్యాచ్ అందుకోవడంతో జడేజా 350వ వికెట్ పూర్తయింది. ఈ మైలురాయితో, టెస్టుల్లో 350 వికెట్లు తీసిన ఐదో భారత బౌలర్‌గా జడేజా నిలిచాడు. అతని కంటే ముందు దిగ్గజాలు అనిల్ కుంబ్లే (619), రవిచంద్రన్ అశ్విన్ (537), కపిల్ దేవ్ (434), హర్భజన్ సింగ్ (417) మాత్రమే ఈ జాబితాలో ఉన్నారు. ఇప్పటివరకు భారత లెఫ్ట్ ఆర్మ్ బౌలర్లలో జహీర్ ఖాన్ (311 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును జడేజా అధిగమించాడు. అంతేకాకుండా, ప్రపంచ క్రికెట్‌లోనూ జడేజా అత్యంత అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. టెస్టుల్లో 4,000కు పైగా పరుగులు, 350కి పైగా వికెట్లు తీసిన నాలుగో ఆటగాడిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డును కపిల్ దేవ్, ఇయాన్ బోథమ్, డేనియల్ వెటోరి మాత్రమే సాధించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఘనత సాధించిన మూడో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కూడా జడేజానే కావడం విశేషం.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# శాంతి లేని శాంతి

అమెరికా ఒత్తిడి తగ్గించేందుకు సిద్ధంగా లేదు.. ఇరాన్ వెనక్కి తగ్గేందుకు సిద్ధంగా లేదు. మధ్యలో నిలిచిపోయింది హర్మూజ్ జలసంధి. చర్చలు జరుగుతున్నాయన్న సంకేతాలు కనిపిస్తున్నా, ఒప్పందం మాత్రం కుదరడం లేదు. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన ఈ జలమార్గం చుట్టూ నెలకొన్న ఉద్రిక్తత ఇప్పుడు అమెరికా–ఇరాన్ ఘర్షణను మించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాలుగా మారుతోంది. యుద్ధం ఆగిపోయిందా? శాంతి వచ్చిందా? అని ప్రపంచం ఆశగా చూస్తున్న వేళ.. మధ్యప్రాచ్యంలో పరిస్థితి మాత్రం 'శాంతి లేని శాంతి'గా మారింది. అమెరికా–ఇరాన్ మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక అవగాహన 60 రోజుల గడువు ముగిసినా శాశ్వత పరిష్కారం కనిపించలేదు. హర్మూజ్ జలసంధి తెరవడం, ఆంక్షలు, ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా సైనిక ఉనికి వంటి అంశాలపై ఇరు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి సంక్షోభానికి కేంద్రబిందువు హర్మూజ్ జలసంధి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన ఈ ఇరుకైన సముద్ర మార్గం ద్వారా సాధారణ పరిస్థితుల్లో భారీగా నౌకలు రాకపోకలు సాగిస్తాయి. కానీ యుద్ధం, భద్రతా ఆందోళనల కారణంగా రవాణా తీవ్రంగా మందగించింది. ఆగస్టు 11న కేవలం ఎనిమిది నౌకలు మాత్రమే జలసంధిని దాటినట్లు నివేదికలు వెల్లడించాయి; యుద్ధానికి ముందు రోజుకు సుమారు 130–140 నౌకలు రాకపోకలు సాగించేవి. అమెరికా హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకా రవాణాను పునరుద్ధరించాలని పట్టుబడుతోంది. మరోవైపు ఇరాన్ తన భద్రత, సార్వభౌమాధికారం, అమెరికా సైనిక ఒత్తిడి తగ్గింపు వంటి అంశాలను ముందుకు తెస్తోంది. ఇరాన్ తాజా హెచ్చరిక మరింత ఆందోళన కలిగిస్తోంది.. దౌత్య ప్రయత్నాలు విఫలమైతే హర్మూజ్‌లో రక్షణాత్మక వైఖరి నుంచి పూర్తిస్థాయి దూకుడు వైపు మారుతామని టెహ్రాన్ ప్రకటించింది. అంటే చర్చల తలుపు పూర్తిగా మూసుకుపోలేదు. కానీ ఆ తలుపు ముందు యుద్ధ నౌకలు, క్షిపణులు, ఆంక్షలు, అనుమానాలు నిలబడి ఉన్నాయి. అమెరికా వెనక్కి తగ్గితే తన వ్యూహాత్మక ఆధిపత్యానికి దెబ్బ తగులుతుందని భావిస్తోంది. ఇరాన్ లొంగితే తన ప్రాంతీయ ప్రభావం, భద్రత, రాజకీయ ప్రతిష్ఠ దెబ్బతింటాయని భావిస్తోంది. అందుకే ఇరువైపులా మాటల్లో శాంతి ఉన్నా.. డిమాండ్లలో కఠినత్వం కొనసాగుతోంది. అసలు సమస్య ఇక్కడే ఉంది. యుద్ధాన్ని ఆపడం కంటే యుద్ధానికి కారణమైన సమస్యలను పరిష్కరించడం కష్టం. తాత్కాలిక కాల్పుల విరమణతో నౌకలు మళ్లీ ప్రయాణించవచ్చు. కానీ హర్మూజ్ నియంత్రణపై విభేదాలు, ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షలు, అమెరికా సైనిక ఉనికి వంటి అంశాలు పరిష్కారం కాకపోతే మరోసారి ఉద్రిక్తతలు చెలరేగే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే నౌకల రాకపోకలు తగ్గడం ప్రపంచ చమురు మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. హర్మూజ్ మార్గంలో రవాణా మరింత దెబ్బతింటే చమురు ధరలు పెరగడం, రవాణా వ్యయాలు పెరగడం, ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరగడం వంటి పరిణామాలు తప్పక ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తాయి.



# తెలంగాణపై బీజేపీ వ్యూహాత్మక విరామం!

భారతీయ జనతా పార్టీ జాతీయ నూతన కార్యవర్గ పునర్వ్యవస్థీకరణలో తెలంగాణ నేతలకు కొత్తగా జాతీయ పదాధికారుల స్థాయిలో చోటు దక్కకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దేశవ్యాప్తంగా సామాజిక, ప్రాంతీయ సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చిన ఈ కూర్పులో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకపోవడం వ్యూహాత్మక నిర్ణయమా? లేక రాష్ట్రంపై పార్టీ అధిష్ఠానం పునరాలోచన చేస్తోందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తెలంగాణలో గత కొన్నేళ్లుగా బీజేపీ గణనీయమైన ఎదుగుదల సాధించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు స్థానాలు గెలుచుకున్న పార్టీ, దుబ్బాక, హుజూరాబాద్ ఉపఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తన ప్రభావాన్ని చాటింది. 2023 శాసనసభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు గెలుచుకుని సుమారు 13.9 శాతం ఓట్లు సాధించింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుని సుమారు 35 శాతం ఓట్లను పొందింది. ప్రస్తుతం పార్లమెంటులో తెలంగాణకు చెందిన ఎనిమిది మంది బీజేపీ సభ్యులు ఉండటం పార్టీ రాష్ట్రంలో సాధించిన విస్తరణకు నిదర్శనం. గతంలోనూ తెలంగాణ నేతలు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, డీకే అరుణ వంటి నేతలు జాతీయ రాజకీయాల్లో తమ ముద్ర వేశారు. బంగారు లక్ష్మణ్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన చరిత్ర కూడా ఉంది. ప్రస్తుతం కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా, బండి సంజయ్ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, సంస్థాగత పదవుల్లో ఇతర రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం వ్యూహంలో భాగమే కావచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే దీన్ని తెలంగాణపై బీజేపీ నిర్లక్ష్యంగా భావించడం తొందరపాటు. జాతీయ కార్యవర్గ కూర్పులో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు, సామాజిక వర్గాలు, మహిళలు, మైనారిటీల ప్రాతినిధ్యం వంటి అంశాలు కీలకంగా ఉంటాయి. తెలంగాణకు చెందిన నేతలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంలో, పార్లమెంటులో ప్రాతినిధ్యం వహిస్తున్నందున, రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడంపైనే అధిష్ఠానం దృష్టి పెట్టి ఉండవచ్చు. అదే సమయంలో ఈ పరిణామం తెలంగాణ బీజేపీ నాయకత్వానికి ఆత్మపరిశీలనకు అవకాశంగా మారాలి. జాతీయ పదవులు రావడం కంటే ప్రజాక్షేత్రంలో బలమైన పునాదులు నిర్మించడం ముఖ్యం. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంతో పాటు రైతులు, నిరుద్యోగులు, యువత, బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలి. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేయాలి. తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలంటే ఢిల్లీ వ్యూహాలకంటే స్థానిక రాజకీయ వాస్తవాలను అర్థం చేసుకోవడం అవసరం. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం, స్థానిక సమస్యలపై నిరంతర పోరాటం, బలమైన క్షేత్రస్థాయి వ్యవస్థే భవిష్యత్తులో బీజేపీ బలాన్ని నిర్ణయిస్తాయి. అందువల్ల జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు కొత్తగా చోటు దక్కకపోవడాన్ని ముగింపుగా చూడాల్సిన అవసరం లేదు. ఇది వ్యూహాత్మక విరామమా, పునరాలోచనకు సంకేతమా అన్నది కాలమే తేల్చాలి. కానీ ఈ పరిణామం తెలంగాణ బీజేపీకు మాత్రం ఆత్మశోధనకు, పునర్వ్యూహరచనకు ఒక అవకాశంగా మారాలి.



రామ కిష్టయ్య సంగనభట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్-
9440595494

# భాషే నాగరికతకు పునాది

మానవ నాగరికత వేల సంవత్సరాల ప్రయాణాన్ని పరిశీలిస్తే ఒక మహత్తరమైన సత్యం స్పష్టమవుతుంది. మనిషి ఆలోచనను మరొకరికి అందించడానికి, అనుభవాన్ని తరతరాలకు బదిలీ చేయడానికి, సమాజాన్ని నిర్మించడానికి, సంస్కృతిని కాపాడడానికి, చరిత్రను నమోదు చేయడానికి భాష ప్రధాన సాధనంగా నిలిచింది. అందుకే నాగరికత, చరిత్ర, సంస్కృతి అనే మూడు మహత్తర నిర్మాణాల వెనుక కనిపించని పునాది భాష. అయితే మానవ భాష ఆవిర్భావం ఇప్పటికీ ఒక గొప్ప రహస్యమే. లక్షల సంవత్సరాల క్రితం మానవ పూర్వీకుడు ఏ భాష మాట్లాడాడు? అతను పలికిన తొలి పదం ఏమిటి? మొదటిసారి ఒక వస్తువుకు పేరు ఎవరు పెట్టారు? మొదటి ప్రశ్నను ఎవరు అడిగారు? మొదటి కథను ఎవరు చెప్పారు? ఈ ప్రశ్నలకు నేటి విజ్ఞానశాస్త్రం ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వలేకపోతోంది. ఎందుకంటే మాటకు శిలాజం ఉండదు. మనిషి పలికిన అరుపు, కేక, సంకేతం లేదా పదం కాలగర్భంలో భద్రపడదు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
పీఆర్వో-కేయూ



మానవ భాష ఒక్కరోజులో పుట్టినది కాదు. ఒక వ్యక్తి సృష్టించిన సాధనం కూడా కాదు. మానవ శరీర పరిణామం, మెదడు అభివృద్ధి, సామాజిక జీవనం, పరస్పర సహకారం, వేట, ఆహార సేకరణ, ప్రమాదాల హెచ్చరిక, పిల్లల సంరక్షణ వంటి అనేక అవసరాల సమ్మేళనంగా భాష క్రమంగా అభివృద్ధి చెంది ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. భాషకు ముందుగా సంకేత వ్యవస్థలు ఉండి ఉండవచ్చు. ముఖ కవళికలు, చేతి కదలికలు, చూపులు, శరీర భంగిమలు, అరుపులు, భయధ్వనులు, ఆనందధ్వనులు మొదటి సమాచార సాధనాలుగా పనిచేసి ఉండవచ్చు. ఒక ప్రత్యేక అరుపు ప్రమాదాన్ని సూచించి ఉండవచ్చు. మరో ధ్వని ఆహారం ఉన్న ప్రదేశాన్ని తెలియజేసి ఉండవచ్చు. తల్లి తన బిడ్డను పిలిచే ఒక ప్రత్యేక ధ్వని క్రమంగా సామాజిక అర్థాన్ని పొందివుండవచ్చు. ఈ విధంగా అర్థవంతమైన ధ్వనులు పునరావృతమవుతూ, తరతరాలకు సంక్రమిస్తూ, చివరకు పదాలు, వాక్యాలుగా పరిణమించి ఉండవచ్చనే భావన ఉంది. అయితే ఇది ప్రత్యక్షంగా నిరూపించబడిన చరిత్ర కాదు. ఆధునిక మానవుడి చరిత్ర కనీసం సుమారు మూడు లక్షల సంవత్సరాల నాటిదని భావిస్తున్నారు. అయితే భాష కూడా అంతే పురాతనమా అన్నది నిర్ధారణ కాలేదు. అందువల్ల మానవుడు మొదట తెలుగు, సంస్కృతం, తమిళం, గ్రీకు లేదా లాటిన్ వంటి ఏదైనా చారిత్రక భాష మాట్లాడాడని చెప్పడం శాస్త్రీయంగా సముచితం కాదు. ఈ భాషలన్నీ మానవ భాషా పరిణామంలో చాలా తరువాత ఏర్పడిన వ్యవస్థలు. మానవ భాష ప్రత్యేకత దాని విస్తృతమైన సామర్థ్యంలో ఉంది. మనిషి గతాన్ని చెప్పగలడు. భవిష్యత్తును ఊహించగలడు. ప్రత్యక్షంగా కనిపించని విషయాలను వివరించగలడు. ప్రశ్నించగలడు. తర్కించగలడు. కల్పిత కథలను సృష్టించగలడు. నియమాలను రూపొందించగలడు. దేవతలు, ప్రకృతి, న్యాయం, ధర్మం వంటి భావనలకు రూపం ఇవ్వగలడు. ఈ సామర్థ్యం మానవ సమాజాన్ని ఇతర జీవుల సామాజిక వ్యవస్థల కంటే ప్రత్యేకమైన స్థాయికి తీసుకెళ్లింది. ఒక వేటగాడు తన అనుభవాన్ని మరొకరికి చెప్పగలిగాడు. ఒక వృద్ధుడు అడవిలోని ప్రమాదాలను యువతరానికి వివరించగలిగాడు. ఒక తల్లి ఔషధ మొక్కను గుర్తించడం నేర్పగలిగింది. ఒక సమూహం నీటి వనరుల స్థానాలను గుర్తుంచుకోగలిగింది. ఇలా వ్యక్తిగత అనుభవం సామూహిక జ్ఞానంగా మారింది. ఆ జ్ఞానం తరతరాలకు చేరినప్పుడు సంస్కృతికి పునాది ఏర్పడింది.

సంస్కృతి అంటే కేవలం పండుగలు, వస్త్రాలు, ఆహారపు అలవాట్లు, నృత్యాలు, పాటలు మాత్రమే కాదు. ఒక సమాజం ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకుంటుందో తెలిపే సమగ్ర జ్ఞాన వ్యవస్థ కూడా సంస్కృతే. సామెతలు ఒక సమాజపు అనుభవాన్ని చెబుతాయి. జానపద గేయాలు భావోద్వేగ చరిత్రను తెలియజేస్తాయి. పురాణ కథలు విశ్వదృష్టిని ప్రతిబింబిస్తాయి. స్థానిక పదాలు ప్రకృతి పరిజ్ఞానాన్ని తెలియజేస్తాయి. బంధుత్వ పదాలు కుటుంబ నిర్మాణాన్ని సూచిస్తాయి. వ్యవసాయ పదాలు ఆర్థిక జీవనాన్ని ప్రతిబింబిస్తాయి. అందువల్ల ఒక భాషను అధ్యయనం చేయడం అంటే కేవలం దాని వ్యాకరణాన్ని అధ్యయనం చేయడం కాదు; ఒక సమాజపు చరిత్రను చదవడం. లిపి పుట్టకముందే మానవ సమాజాలకు చరిత్ర ఉండేది. అయితే ఆ చరిత్ర ప్రధానంగా మౌఖిక జ్ఞాపకాల రూపంలో ఉండేది. వంశాల పూర్వీకుల కథలు, తెగల వలస ప్రయాణాలు, యుద్ధ గాథలు, పంటల పద్ధతులు, స్థానిక విశ్వాసాలు పాటలు, కథల రూపంలో తరతరాలకు చేరేవి. లిపి ఆవిర్భావంతో ఈ జ్ఞాపకాలకు శాశ్వత రూపం లభించింది. మెసపొటేమియాలో సుమారు క్రీస్తుపూర్వం 3200 ప్రాంతంలో క్యూనిఫార్మ్ లిపి అభివృద్ధి చెందింది. పరిపాలన, వ్యాపారం, పన్నులు, ధాన్య నిల్వలు వంటి విషయాలను నమోదు చేయడం సాధ్యమైంది. ఈజిప్టులో సుమారు క్రీస్తుపూర్వం 3100 ప్రాంతానికి చెందిన లిఖిత సంప్రదాయం రాజ్యపాలన, మతం, సామాజిక వ్యవస్థలను అర్థం చేసుకోవడానికి ఆధారమైంది. భారత ఉపఖండంలోని సింధు నాగరికత సుమారు క్రీస్తుపూర్వం 2600–1900 మధ్య అత్యున్నత దశకు చేరినా, అక్కడి సంకేతాలను ఇప్పటికీ పూర్తిగా అర్థం చేసుకోలేకపోవడం చరిత్రలో ఒక గొప్ప రహస్యంగా మిగిలింది.

వ్యవసాయం ప్రారంభమైన తరువాత మానవ సమాజంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. స్థిర నివాసాలు ఏర్పడ్డాయి. గ్రామాలు, పట్టణాలు పెరిగాయి. పంటలు, విత్తనాలు, పరికరాలు, పశువులు, నీటి వనరులు, ఋతువులకు కొత్త పేర్లు ఏర్పడ్డాయి. భాషలో కొత్త పదాలు పుట్టడం సమాజంలో కొత్త అనుభవాలు పుట్టినదానికి సూచనగా మారింది. తరువాత రాజ్యాలు, చట్టాలు, పన్నులు, వాణిజ్యం, సైన్యాలు ఏర్పడ్డాయి. వీటన్నింటినీ నిర్వహించడానికి భాష అవసరమైంది. రాజాజ్ఞలకు, ఒప్పందాలకు, న్యాయానికి, పరిపాలనకు, మతాచారాలకు భాష ప్రధాన ఆధారమైంది. అందువల్ల భాష సమాజాన్ని నిర్మించడమే కాకుండా అధికార నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించింది. ఒక ప్రాంతంలో రాజకీయ అధికారం మారితే భాషా పరిసరాలు కూడా మారుతాయి. యుద్ధాలు, వలసలు, వాణిజ్యం, వివాహ సంబంధాలు, రాజ్య విస్తరణల ద్వారా పదాలు ఒక భాష నుంచి మరొక భాషలోకి చేరుతాయి. కాబట్టి భాషలోని మార్పులు కేవలం భాషా పరిణామాలు కావు; అవి సామాజిక, చారిత్రక సంబంధాలకు కూడా సాక్ష్యాలు. అయితే భాష ఆధారంగా చరిత్రను నిర్మించేటప్పుడు జాగ్రత్త అవసరం. ఒక పదం ఒక భాషలో ఉండటం మాత్రమే దాని మూలాన్ని నిర్ణయించడానికి సరిపోదు. పదాలు రూపం మార్చుకోవచ్చు. అర్థాలు మారవచ్చు. ఇతర భాషల నుంచి వచ్చిన పదాలు స్థానిక పదాలుగా మారవచ్చు. అందువల్ల భాషా ఆధారాలను పురావస్తు, చారిత్రక, భౌగోళిక ఆధారాలతో కలిపి పరిశీలించాలి. భాష మానవ భావోద్వేగాలకు కూడా సామాజిక రూపం ఇచ్చింది. ప్రేమ, బాధ, కోపం, క్షమాపణ, న్యాయం, అన్యాయం, ధర్మం వంటి భావనలకు పదాలు ఏర్పడ్డాయి. చట్టాలు భాషలోనే రూపొందాయి. రాజ్యాంగాలు భాషలోనే ఉన్నాయి. ప్రజాస్వామ్య చర్చలు, ప్రజల హక్కులు, డిమాండ్లు, రాజకీయ వాదనలు అన్నీ భాష ద్వారానే వ్యక్తమవుతున్నాయి.

సాహిత్యం భాషకు కళాత్మక రూపం ఇచ్చింది. కవిత్వం భావోద్వేగాన్ని, కథ కల్పనను, చరిత్ర జ్ఞాపకాన్ని, తత్వశాస్త్రం ప్రశ్నించే శక్తిని, విజ్ఞానం పరిశీలనను భాష ద్వారా వ్యక్తం చేశాయి. ముద్రణా యంత్రం ఆవిర్భావంతో పుస్తకాలు, వార్తాపత్రికలు విస్తరించాయి. విద్య ప్రజల్లోకి చేరింది. భాష సామాజిక మార్పుకు శక్తివంతమైన సాధనంగా మారింది. రేడియో, దూరదర్శన్, సినిమా, అంతర్జాలం వంటి మాధ్యమాలు భాషను కోట్లాది ప్రజల మధ్యకు తీసుకెళ్లాయి. నేడు కృత్రిమ మేధస్సు, యంత్ర అనువాదం, స్వర గుర్తింపు వంటి సాంకేతిక పరిజ్ఞానాలు భాషా వినియోగానికి కొత్త అవకాశాలను తెస్తున్నాయి. అయితే ఈ మార్పులతో పాటు చిన్న భాషలకు ముప్పు కూడా పెరుగుతోంది. ప్రపంచంలోని వేలాది భాషల్లో అనేకం అంతరించే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఒక భాష అంతరించిపోవడం అంటే కొన్ని పదాలు కనుమరుగవడం మాత్రమే కాదు. ఒక సమాజపు జ్ఞాపకాలు, జానపద గీతాలు, సామెతలు, స్థానిక చరిత్ర, ప్రకృతి పరిజ్ఞానం, జీవన విధానాలు కూడా ప్రమాదంలో పడతాయి. అందువల్ల భాషా పరిరక్షణ అనేది కేవలం సాహిత్య పరిరక్షణ కాదు; మానవ జ్ఞాన పరిరక్షణ. భారతదేశం భాషా వైవిధ్యానికి అద్భుతమైన ఉదాహరణ. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూలులో 22 భాషలకు గుర్తింపు ఉన్నప్పటికీ దేశంలోని భాషా ప్రపంచం దీనికంటే ఎంతో విస్తృతమైనది. అనేక ప్రాంతీయ, గిరిజన భాషలు, మాండలికాలు శతాబ్దాలుగా తమ ప్రత్యేక జ్ఞానాన్ని, సంస్కృతిని మోస్తున్నాయి. అందుకే భాష నాగరికతకు పునాది, చరిత్రకు జ్ఞాపకశక్తి, సంస్కృతికి ఆత్మ, మానవ సమాజానికి జీవనాడి. భాషను కాపాడుకోవడం అంటే గతాన్ని మాత్రమే కాదు.. మన భవిష్యత్తును కూడా కాపాడుకోవడం.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.